ఒంగోలు నగర పాలక సంస్థ పాలకవర్గంలో రాజకీయం వేడెక్కింది. మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. మెజారిటీ సభ్యులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. దీంతో పరిస్థితి మేయర్ వర్సెస్ కార్పొరేటర్లుగా తయారైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్.. టీడీపీకి చెందిన కార్పొరేటర్లు, మేయర్‌తో ఆదివారం పొద్దుపోయే వరకూ వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మేయర్ తీరుపై తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కడంతోపాటు ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఇటు అధికారులు, అటు తమను కలుపుకుపోవడం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదేసమయంలో మేయర్ గంగాడ సుజాత.. కార్పొరేటర్లు తనకు సహకరించడం లేదని, కనీస గౌరవం ఇవ్వడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వారిపైనా కొన్ని ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జనార్దన్ పరిస్థితిని చక్కదిద్దే చర్యలను చేపట్టారు. నగరాభివృద్ధిపై కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.



కార్పొరేషన్‌లో కాక

మేయర్ వర్సెస్ కార్పొరేటర్లు

- వేర్వేరుగా ఎమ్మెల్యే దామచర్ల సమావేశం
- సుజాత ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని కార్పొరేటర్ల ఫిర్యాదు
- ఆమె అవినీతి శ్రుతిమించిందంటూ ఆరోపణలు
- వారు తనకు సహకరించడం లేదన్న గంగాడ

నేడు కార్పొరేషన్ కార్యాలయానికి దామచర్ల

మేయర్, కార్పొరేటర్ల మధ్య వివాదాన్ని కొలిక్కి తెచ్చేందుకు ఎమ్మెల్యే జనార్దన్ ఆదివారమంతా కసరత్తు చేశారు. వేర్వేరుగా సమావేశమై వారు చెప్పిన విషయాలను ఆలకించారు. ఆతర్వాత కార్పొరేషన్‌లో ఏం జరుగుతోందన్న విషయంపై ఆరా తీశారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత టీడీపీ తరఫున గెలిచిన, కొద్దికాలం క్రితం పార్టీలో చేరిన కార్పొరేటర్లను పిలిపించుకొని మరోసారి దామచర్ల ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బజారుకెక్కితే పార్టీ పరువుపోతుందని, ఈ విషయంలో తాను తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలని వారిని ఆదేశించారు. మేయర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా, అవినీతి వ్యవహారాలకు పాల్పడకుండా కట్టడి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సమాచారం. అలాగే హద్దులు మీరిన కొందరు కార్పొరేటర్లు కూడా పద్ధతి మార్చుకోకపోతే అవసరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. తదనంతరం ఆయన సోమవారం కార్పొరేషన్‌కు వస్తున్నట్లు అధికారులకు సమాచారమిచ్చారు. అభివృద్ధి పనులు, ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాపై సమావేశం నిర్వహించాలని ఆయన నిర్ణయించుకున్నారు. అవసరమైన సమాచారంతో సిద్ధంకావాలని అధికారులకు సూచించారు. పాలకవర్గ కాలపరిమితి ఏడాదిలోపే ఉండటం, రానున్న ఆరునెలల తర్వాత ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో ఉండటాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని పాలకమండలిని కట్టడి చేసేందుకే దామచర్ల పరిమితమవుతారా? లేక మేయర్ మార్పునకు సిద్ధమవుతారా? అన్నదానిపై వచ్చేనెల మొదటి వారంలో నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు.

ఒంగోలు కార్పొరేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గంలో వేరుకుంపట్లు ఏర్పడ్డాయి. తొలి నుంచి మేయర్ గంగాడ సుజాతతో కలిసి నడిచిన పలువురు కార్పొరేటర్లు ఇప్పుడు ఆమె వ్యవహార శైలి, పనితీరుపై గరంగరంగా ఉన్నారు. సుజాత అవినీతి శ్రుతిమించిందని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల కాలంలో తమకు తెలియకుండానే కొన్ని వ్యవహారాల్లో తానే నిర్ణయాలు తీసుకోవడాన్ని కూడా ఆక్షేపిస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి నగర అభివృద్ధిలో మేయర్ తమను కలుపుకొని పోవడం లేదని, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. అధికారులను ఒత్తిడికి గురి చేయడంతోపాటు పలు అంశాలలో తానే సుప్రీం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

మేయర్‌కు మెజారిటీ కార్పొరేటర్లు దూరం

ఒంగోలు నగర పాలక సంస్థకు గతంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీకి 43, టీడీపీకి ఆరు, జనసేనకు ఒక డివిజన్ దక్కాయి. దీంతో కార్పొరేషన్ పాలకవర్గం వైసీపీ పరమైంది. అయితే సాధారణ ఎన్నికల అనంతరం మేయర్ గంగాడ సుజాతతోపాటు ఆపార్టీ కార్పొరేటర్లలో 18 మంది టీడీపీలో చేరారు. అనంతరం పరిణామాల్లో 21 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. చివరికి వైసీపీకి నలుగురు కార్పొరేటర్లు మాత్రమే మిగిలారు. ఇప్పటికే జనసేన కార్పొరేటర్లు మేయర్‌కు దూరంగా ఉంటున్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్లంతా ఆమె తీరును వ్యతిరేకించడంతోపాటు అవినీతి ఆరోపణలు చేస్తున్నారు.

మేయర్, కార్పొరేటర్లతో దామచర్ల వేర్వేరుగా భేటీ

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదివారం టీడీపీ కార్పొరేటర్లు, మేయర్‌తో వేర్వేరుగా సమావేశమయ్యారు. మొదటగా కార్పొరేటర్లతో ఆయన మాట్లాడారు. వారి అభిప్రాయాలు, కార్పొరేషన్‌లో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్పొరేటర్లు మేయర్‌ను మార్చాలని ముక్తకంఠంతో కోరినట్లు సమాచారం. అందుకు తామంతా సంతకాలు చేస్తామని వెల్లడించినట్లు తెలిసింది. మేయర్ పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారంటూ కొన్ని అంశాలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఆమె తన, మన అన్న తేడా లేకుండా ప్రతిదానికీ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తాము అడిగిన పలు పనులకు కూడా నాకేంటి? అని అడుగుతూ అవమానిస్తున్నారని వాపోయినట్లు సమాచారం.

కార్పొరేటర్లపై మేయర్ ఫిర్యాదులు

కార్పొరేటర్లతో భేటీ అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మేయర్ సుజాతతో వేరుగా మాట్లాడారు. కార్పొరేటర్ల ఫిర్యాదులను ఆమె దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరినట్లు తెలిసింది. దీంతో మేయర్ తనను సమర్థించుకుంటూ సమాధానం ఇచ్చే ప్రయత్నం చేసినట్లు సమాచారం. కార్పొరేటర్లు తనకు సహకరించడం లేదంటూ వారిపైనా కొన్ని ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆమెతో ఎమ్మెల్యే జనార్దన్ మాట్లాడుతూ.. 'నగర అభివృద్ధికి సమష్టి కృషి, సహకారం అవసరం. అందరినీ కలుపుకొని వెళ్లాలి. ఏకపక్ష నిర్ణయాలు సరికాదు' అని సూచించినట్లు సమాచారం.

మేయర్ ప్రత్యేక సమావేశాలు..!

ఇటీవల కాలంలో మేయర్ సుజాత కొందరు కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. కమిషనర్ తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, అభివృద్ధి పనులు, సమావేశాలలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేసినట్లు సమాచారం. అంతలోనే శనివారం కార్పొరేషన్ సెక్షన్ హెడ్‌లతో సమావేశం నిర్వహించిన ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులతో మేయర్ సమావేశం ఏర్పాటు చేసి పలు ఆదేశాలు జారీ చేయడాన్ని కార్పొరేటర్లు తప్పుబడుతున్నారు.

టీచర్ల బదిలీల్లో గందరగోళం

- అస్తవ్యస్తంగా పాయింట్ల కేటాయింపు
- సాంకేతిక సమస్యలతో అయోమయం
- పరిష్కారం దొరక్క ఉపాధ్యాయుల గగ్గోలు

ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం నెలకొంది. సాంకేతిక సమస్యలతో పాయింట్ల కేటాయింపు అస్తవ్యస్తంగా మారింది. దీంతో టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. వెబ్‌సైట్‌లో సమస్యలు తలెత్తుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. రోజూ ఏదో ఒక సమస్య వస్తూనే ఉంది. జిల్లాస్థాయిలో పరిష్కరించలేక పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయ ఐటీ విభాగానికి నివేదించినా ఫలితం కన్పించడం లేదు. కొందరు టీచర్లకు అసలు ఓటీపీ రాకపోవడంతో దరఖాస్తులు సమర్పించలేక సతమతమవుతున్నారు.

ఒంగోలు విద్య, మే 25 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల బదిలీలు ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామని రెండు నెలల ముందుగానే అధికారులు ప్రకటించినా ఆమేరకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమయ్యారు. బదిలీల్లో పాయింట్ల కేటాయింపే కీలకం. వాటి ఆధారంగానే ఉపాధ్యాయులకు వారు కోరుకున్న స్థానాలను కేటాయిస్తారు. ఈ విషయంలోనూ తిరకాసు చోటుచేసుకుంది. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ప్రాథమిక సీనియారిటీ జాబితాల్లో ఒక్కరికి కూడా స్పౌజ్ పాయింట్లు కలవలేదు. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం కమిషనర్ కార్యాలయ ఐటీ సెల్‌కు నివేదించినా పరిష్కారం కాలేదు. శనివారం రాత్రి కమిషనర్ కార్యాలయం హెచ్‌ఎంల ప్రాథమిక సీనియారిటీ జాబితాను స్పౌజ్ పాయింట్లు లేకుండానే విడుదల చేసింది. దీంతో వారు ఆందోళన చెందుతూ ఆదివారం డీఈవోను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. కొందరికి స్పౌజ్ ఉందని సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసినా ఐదు పాయింట్లు కలవడం లేదు.

- చట్టబద్ధంగా విడాకులు తీసుకున్న కొందరు మహిళలకు ఐదు పాయింట్లు కలవలేదు.
- కొందరు టీచర్లకు పునర్విభజన పాయింట్లు, మరికొందరికి వారు పనిచేస్తున్న స్టేషన్ పాయింట్లు కలవడం లేదు.
- కొందరికి ఓటీపీ రావడం లేదు. అలాంటి వారు దరఖాస్తు చేయలేక డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.
- 2021లో బదిలీ అయిన వారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకుంటే వారికి పాయింట్లు రావడం లేదు.
- అవివాహిత మహిళా టీచర్లకు పాయింట్లు కలవడం లేదు.
- పునర్విభజనలో మిగులుగా తేలి తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారికి వారి పాత స్టేషన్ పాయింట్లు కలవడం లేదు.

పాయింట్ల విషయంలో పూటపూటకూ మార్పులు

బదిలీ పాయింట్ల కేటాయింపులో పూటపూటకూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఎస్‌జీటీల విషయంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఒకే డీఎస్సీలో ఎంపికై ఒకే రోజు ఉద్యోగంలో చేరి ఒకే కేటగిరీ పాఠశాలల్లో పనిచేస్తూ 23న దరఖాస్తు చేసిన వారికి, 24న దరఖాస్తు చేసిన వారికి పాయింట్లలో తేడారావడంతో ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు మార్పులు, చేర్పులకు అనుగుణంగా రాతపూర్వకంగా ఉత్తర్వులు ఇవ్వకుండా కేవలం వెబెక్స్‌లో నోటిమాటతో బదిలీల ప్రక్రియను నడిపిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

వీరయ్య హత్య కేసులో నిందితులు పోలీసు కస్టడీకి

ఒంగోలు క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకేసులో నిందితులు తొమ్మిది మందిని నాలుగురోజులపాటు విచారించేందుకు పోలీసు కస్టడీకి తీసుకున్నారు. ఒంగోలు జైలులో ఉన్న వారిని ఆదివారం పోలీసులు తాలుకా స్టేషన్‌కు తరలించారు. ఈనెల 28 వరకూ విచారించనున్నారు.



కడపలో ఏర్పాట్లపై మంత్రి నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

మహానాడుకు కదులుతున్న శ్రేణులు

- నేటి రాత్రికే కడప చేరుకోనున్న ముఖ్యనేతలు
- ఇప్పటికే అక్కడ ఏర్పాట్లలో కొందరు
- ముగింపు రోజున బహిరంగ సభకు పశ్చిమం నుంచి భారీగా సమీకరణ

ఒంగోలు, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు జిల్లా నుంచి ఆపార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల 27నుంచి 29 వరకూ మూడు రోజులపాటు మహానాడు నిర్వహిస్తున్న విషయం విదితమే. తొలి రెండు రోజులు ప్రతినిధుల సభ, మూడోరోజైన ఈనెల 29న ముగింపు సందర్భంగా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. సాధారణంగా మహానాడు ఎక్కడ జరిగినా టీడీపీ శ్రేణులు జిల్లా నుంచి పెద్దసంఖ్యలోనే హాజరవుతుంటారు. ఈసారి కడపలో ఏర్పాటు చేయడంతో మరింత ఎక్కువ సంఖ్యలో వెళ్లనున్నారు.

ఏర్పాట్లలో జిల్లా నేతలు

తొలి రెండు రోజులు జరిగే ప్రతినిధుల సభకు నియోజకవర్గ, మండల స్థాయి ముఖ్య నాయకులు హాజరు కావాల్సి ఉంది. దీంతో ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్య నాయకులు సోమవారం రాత్రికే కడప నగరానికి చేరుకోనున్నారు. మరోవైపు మహానాడు నిర్వహణకు 19 కమిటీలను ఏర్పాటు చేసిన టీడీపీ అధిష్ఠానం... వాటిలో జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నాయకులను నియమించింది. దీంతో ఆ బాధ్యతల్లో ఉన్న కొందరు కడప చేరి ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాకు చెందిన యువనేత, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యను రెండు కమిటీల్లో నియమించగా నాలుగైదు రోజులుగా అక్కడే ఉండి ఏర్పాట్లలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. కనిగిరి, గిద్దలూరు శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి కడపలోని ఏర్పాట్లలో పాల్గొన్నారు.

భారీగా జన సమీకరణ

మహానాడు ముగింపు రోజైన 29వ తేదీన కడప శివారులో భారీ బహిరంగ సభను టీడీపీ నిర్వహిస్తోంది. దానికి కూడా జిల్లా నుంచి పార్టీ శ్రేణులు భారీగానే తరలివెళ్లనున్నారు. కడప జిల్లాకు సమీప ప్రాంతాలుగా జిల్లాలోని కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాలు ఉన్నాయి. ఆ నియోజకవర్గాలతోపాటు అక్కడికి దగ్గరగా ఉండే మార్కాపురం, వైపాలెం, దర్శిల నుంచి కూడా బహిరంగ సభకు భారీగానే జనసమీకరణ జరుగుతోంది. సగటున ఒక్కో నియోజకవర్గం నుంచి 5 వేల నుంచి 7వేల మంది వరకూ బహిరంగ సభకు వెళ్లేలా వాహనాలు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. తూర్పుప్రాంతంలో ఉన్న ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల నుంచి ప్రతినిధుల సభకు ఒక్కో మండలం నుంచి ఒక బస్సును నాయకులు ఏర్పాటు చేశారు. మరికొందరు సొంత వాహనాల్లో తరలివెళ్లనున్నారు. చివరి రోజు సభకు కూడా ఈ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలోనే వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.



ఒంగోలులో నిర్వహించిన శోభాయాత్రలో భారీ ఆంజనేయుడు

వేడుకగా శోభాయాత్ర

విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఒంగోలులో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర అత్యంత వేడుకగా జరిగింది. నగరంలోని ప్రధాన రహదారుల్లో ఇది సాగింది. భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి యాత్ర నిర్వహించగా ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. యువకులు బైక్‌లతో హాజరయ్యారు.

శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం





ఆక్రమణను అడ్డుకొని రెవెన్యూ, పోలీసు సిబ్బందికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

పెద్దవరంలో 67 ఎకరాల భూమి ఆక్రమణ

- రూ.కోట్లు చేతులు మారిన వైనం
- అడ్డుకున్న గ్రామస్థులు
- వాహనాలు స్వాధీనం

7లో

పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మంత్రి స్వామిని సన్మానిస్తున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య

పొన్నలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతో కలిసి ఆదివారం మండలంలోని మాలెపాడు గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామిని ఎమ్మెల్యే కొండయ్య సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాంబశివరావు, కర్ణా కోటిరెడ్డి, మండవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

ఒంగోలు కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘ ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక వైశ్యభవన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పలు మండల కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలను అందజేసి సత్కరించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోట హనుమంతరావు, ఆకుతోట శ్రీనివాసరావు, కోశాధికారి వక్కలగడ్డ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముప్పల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ హాజరై ప్రసంగించారు. ఆర్యవైశ్య సంఘ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అత్తులూరి సుబ్బారావు, తూనుగుంట్ల శ్రీనివాసరావు, పల్లపోతు వెంకటేశ్వరరావు, చలువాది బదరీనారాయణ, లక్ష్మీమోహన్, దేవతు ప్రసాద్ పాల్గొన్నారు.

కొండపిలో యోగా

కొండపి, మే 25 (ఆంధ్రజ్యోతి): కొండపిలో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశంలో భాగంగా ఆదివారం ఉదయం అంబేద్కర్ నగర్‌లో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు, యోగా ఇన్‌స్ట్రక్టర్‌లు గుండా హరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైసీపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ సుబ్బారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీకి పూర్వ వైభవం తెచ్చేలా శ్రేణులు పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సాయిబీటీపీ కన్వెన్షన్‌హాలులో ఆదివారం సాయంత్రం నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైవీ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి కె.నాగేశ్వరరావు, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైపాలెం ఎమ్మెల్యే టి.చంద్రశేఖర్, మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కాకుమాను రాజశేఖర్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కె.కనకారావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంతనూతలపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 కేవీ పి.గుడిపాడు ఫీడర్లలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా కొత్తలైన్ వేస్తున్నందున సోమవారం పి.గుడిపాడు, కొనగానివారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ రూరల్ డీఈ శ్రీకాంత్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 9గంటల వరకు త్రీఫేస్ కరెంటు ఇస్తారని, అనంతరం ఉదయం 9 సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తామన్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు త్రీఫేస్ కరెంటు ఇస్తారని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మాలలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాలలపై జరుగుతున్న దాడులను అడ్డుకునేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని మాల యువసేన వ్యవస్థాపకుడు, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు పిలుపునిచ్చారు. స్థానిక పాత రిమ్స్‌లో ఆదివారం మాలమహానాడు జేఏసీ చైర్మన్ బిళ్లా వసంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో దళితులపై నిరంతరం దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు ఇంకొక వైపు సామాజిక బహిష్కరణలు కూడా పెరిగాయని, ఇప్పటికే దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అనేక ఆందోళనలు నిర్వహిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. అందువల్ల మాలలు మరో ఉద్యమానికి సంసిద్ధులు కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పనలో ప్రభుత్వం విఫలం

● రాజ్యసభ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. స్థానిక లాయర్‌పేటలోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నా, లేకున్నా రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. జిల్లాలోని పొగాకు రైతులు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు ధైర్యం నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 28వతేదీన పొదిలి వేలం కేంద్రాన్ని పరిశీలిస్తారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోలు చేసిందన్నారు. ఇప్పుడు పొగాకు, మిర్చి రైతులు ఇబ్బందులుపడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్ర భుత్వం దిగివచ్చేంతవరకు పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమంగా వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేస్తున్నదని ఆరోపించారు. లిక్కర్ కేసులో ఎలాంటి అక్రమాలు జరగలేదని చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చాక ఒక్క పింఛను తప్ప ఏమైనా అమలు చేశారా అని ప్రశ్నించారు.

కొప్పోలు రోడ్డు జలమయం

● వర్షం వస్తే వాహనదారుల అవస్థలు



రోడ్డులో నిలిచిన వర్షపునీరు

ఒంగోలు(రూరల్), మే25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డు కొద్దిపాటి వర్షం పడినా జలమయం అవుతోంది. ఈ రోడ్డుకు డ్రైనేజీ సౌకర్యం లేకపోవటంతో తరబడి వర్షపు నీరు అలాగే నిలిచిపోతోంది. దీంతో తారురోడ్డు గుంతలపడి వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. దీనికితోడు పలు కాలనీలకు చెందిన మురుగు నీరు కూడా ఈ రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ కార్యాలయంలో సండే సందడి

సెలవు రోజు సైతం తలుపులు తెరుచుకున్న వైనం ● భూములు ఆన్‌లైన్ చేయడంలో బిజీగా అధికారులు, సిబ్బంది

ఈ నెలాఖరుకు తహసీల్దార్ ఉద్యోగ విరమణ ● ఈ నేపథ్యంలో నెలకొన్న హడావుడిపై విమర్శలు



తమ భూములను ఆన్‌లైన్ చేయాలని కోరుతున్న రైతులు

మర్రిపూడి, మే 25 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడిలోని తహసీల్దార్ కార్యాలయం ఆదివారం కూడా తలుపులు తెరుచుకుంది. కొన్ని రకాల భూముల ఆన్‌లైన్ హడావుడి నెలకొంది. తహసీల్దార్ జ్వాలా నరసింహం ఈ నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేయనుండటం గమనార్హం. భూములను ఆన్‌లైన్ చేయించుకోవాలనే తొందరతో రైతులు కార్యాలయం ఎదుట కొద్దిసేపు హంగామా చేశారు.

మర్రిపూడిలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వివాదాస్పద సర్వేనెంబర్ 1890-1సీలో 320 ఎకరాల రిజిస్టర్ భూమిని ఆన్‌లైన్ చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలుసుకొని మర్రిపూడికి చెందిన కొందరు రైతులు కార్యాలయం దగ్గరకు చేరుకొని తహసీల్దార్‌తో వాగ్వివాదానికి దిగారు. ఆ భూమిపై తమకు హక్కులు ఉన్నాయని, తమ పేర్లు కూడా ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్‌ను కోరారు. హక్కుపత్రాలు తీసుకొస్తే పరిశీలించి ఆన్‌లైన్ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. వారంలో ఉద్యోగ విరమణ చేయనున్న తహసీల్దార్ ఆ భూములను ఆన్‌లైన్ చేయడం పట్ల కొందరు రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఏడాది కాలంగా స్పందించని తహసీల్దార్ ఇప్పుడు ఆన్‌లైన్ చేయడం ఏమిటని రైతులు నిలదీస్తున్నారు. ఇప్పటికే గంజిపాలెం, గుండ్లసముద్రం గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా పశువుల మేత భూములను అక్రమంగా ఆన్‌లైన్ చేశారంటూ ఎస్టీకాలని రాజుపాలెంకు చెందిన రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై విచారణ జరుగుతుండగా మర్రిపూడిలో ఏళ్ల తరబడి నెలకొన్న వివాదాస్పద రిజిస్టర్ భూమిని ఆన్‌లైన్ చేసేందుకు తహసీల్దార్ ప్రయత్నిస్తుండటం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద తహసీల్దార్ ఉద్యోగ విరమణ పుణ్యమా అని తహసీల్దార్ కార్యాలయం ఆదివారం కూడా సందడి నెలకొంది.

ఇరవై రోజుల నుంచి సర్వర్ సమస్య

- జ్వాలా నరసింహం, తహసీల్దార్

ఇరవై రోజులుగా సర్వర్ పనిచేయకపోవడంతో ఆన్‌లైన్ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. సరైన భూహక్కుపత్రాలను పరిశీలించాకే ఆన్‌లైన్ చేస్తున్నాం. ఆన్‌లైన ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు ఇచ్చేది లేదు. ఇటీవల మర్రిపూడిలో రాష్ట్ర మంత్రి స్వామి ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి రైతుల నుంచి తీసుకున్న అర్జీలను పరిష్కరించేందుకే ఆదివారం కూడా పనిచేస్తున్నాం.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



తూర్పునాయుడుపాలెంలో చెక్‌ను అందజేస్తున్న మంత్రి స్వామి



ఒంగోలులో సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

కొండపి, మే 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 49 మందికి 35 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పంపిణీ చేశారు. ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో జరుగుమల్లి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, మాజీ జడ్పీటీసీ తుళ్లూరి నరసింహారావు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలులో బీఎన్..

సంతనూతలపాడు : మండలంలో ఆయా గ్రామాల్లోని 16మంది లబ్ధిదారులకు వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.23,50,817 చెక్కులను ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఒంగోలులోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకున్న సుదీర్ఘ పరిపాలన అనుభవంతో అందరికీ సంక్షేమఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు డి.అనిల్, వి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

● ప్రమాణస్వీకారం చేసిన సభ్యులు



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గసభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వనాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక భాగ్యనగర్‌లోని సంఘ కార్యాలయంలో ఎన్నికల అధికారిగా డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యం, సహాయ ఎన్నికల అధికారిగా కె.రమణ, ఇ.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అయితే పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోమటిగుంట వెంకటేశ్వర్లు (రెవెన్యూ), సహాధ్యక్షులుగా అలేటి నాగయ్య(ఇరిగేషన్), ఉపాధ్యక్షులుగా గర్నెపూడి యోబు(ఆర్అండ్‌బీ), ముప్పరపు వెంకయ్య(వ్యవసాయ శాఖ), కార్యదర్శిగా డి.ప్రేమ్‌నాథ్(సోషల్ వెల్ఫేర్), సంయుక్త కార్యదర్శులుగా బీవీ.సుబ్బారావు(రెవెన్యూ), పులుకూరి దేవకుమారి(కోఆపరేటివ్), ప్రచార కార్యదర్శిగా శాసనాల రమాదేవి, కోశాధికారిగా జి.సుబ్బరాయుడు(వ్యవసాయశాఖ)లను ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు.

ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక



సింగరాయకొండలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



సంతనూతలపాడులో పూర్వ విద్యార్థుల కలయిక

సింగరాయకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి) : వారంతా దాదాపు 32 ఏళ్ల కిందట ఒకే చోట పదో తరగతిని అభ్యసించారు. ఆ తరువాత కొద్ది మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించారు. మరికొంది మంది వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఇంకొంత మంది తము ఎంచుకొన్న మార్గాల్లో జీవనాన్ని గడుపుతున్నారు. 1992-93 సింగరాయకొండ పదోతరగతి అభ్యసించిన వీరంతా ఆదివారం స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో ఆత్మీయ కలయిక పేరుతో సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో గడిపిన తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. భవిష్యత్‌లో తమ బ్యాచ్ తరపున సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. అనంతరం విద్యనేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు : స్థానిక జడ్పీహైస్కూల్లో (2000-2001) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దేశంలో ఆయా రాష్ట్రాలతో పాటు, విదేశాల్లో స్థిరపడిన వారంతా 24 ఏళ్ల తర్వాత ఉత్సాహంగా కలుసుకున్నారు. గత స్మృతులను నెమరవేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెట్టు.. చిగురించేట్టు..!

భారీ వృక్షాన్ని మరోచోటకు మార్చిన కార్పొరేషన్ అధికారులు





చెట్టును వేళ్లతో సహా లేపుతున్న ఎక్స్‌కవేటర్లు... అనంతరం తరలిస్తున్న సిబ్బంది

ఒంగోలు కార్పొరేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రజల సౌకర్యార్థం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఆదివారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం నుంచి రాజాపానగల్ రోడ్డు వైపు జరుగుతున్న విస్తరణ పనులకు స్థానిక మాతా, శిశు వైద్యశాలలోని వందేళ్ల చరిత్ర కలిగిన రెండు భారీ వృక్షాలు వేళ్లూనుకుపోయి అడ్డంగా ఉన్నాయి. కొన్ని సంవత్సరాలుగా వేలాది మంది అమ్మలకు నీడనిచ్చిన రెండు చెట్లను కూల్చివేసేందుకు ఇష్టపడని కార్పొరేషన్ అధికారులు ఆ చెట్లను వేళ్లతో సహా తొలగించి ఆసుపత్రిలోని మరో ఆవరణలో నాటాలని నిర్ణయించారు. అందులో ఒక వృక్షాన్ని ఆదివారం తొలగించి మరోచోట గుంతతీసి అందులో నాటారు. అందుకు అనేక విధాలప్రయాస పడాల్సి వచ్చినా అధికారులు మాత్రం వృక్షో రక్షతి రక్షితః అనే విధంగా చేయడాన్ని నగర ప్రజలు, పర్యావరణ ప్రేమికులు అభినందిస్తున్నారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రగతి పనులను సమర్థవంతంగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అన్వర్ అనే వ్యక్తికి తొలగించిన వృక్షాలకు తగిన మందును వేసి తిరిగి చిగురించేలా చేసిన అనుభవం ఉందన్నారు. ఆయన సేవలను వినియోగించుకుంటున్నామని చెప్పారు.



ఆసుపత్రి ఆవరణలో చెట్టును పాతి నీరు పెడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

400 మందికి వైద్య పరీక్షలు

కొండపి, మే 25 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఒంగోలు వెంకటరమణ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రోగులకు తక్కువ ఖర్చుతో వెంకట రమణ హాస్పటల్ యాజమాన్యం మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. వైద్యులు కె.చంద్రశేఖర్, వి.సుబ్రహ్మణ్యేశ్వరి 400 మంది రోగులు పరీక్షించి మందులు అందించారు. ఆర్ఎంపీ రాము, పీఆర్‌వో మల్లికార్జున, నారాయణస్వామి, సోమయ్య, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ఎస్ఐ రజియాసుల్తానా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న ఎస్ఐ రజియాసుల్తానా

నాగులుప్పలపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు ఎస్ఐగా రజియాసుల్తానా ఆదివారం బాధ్యతులు చేపటారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ బి.శ్రీకాంత్‌పై పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొని మెడికల్ లీవ్‌పై వెళ్లారు. దీంతో ఎస్పీ దామోదర్ ఇక్కడ ఎస్ఐగా రజియాసుల్తానాను నియమించారు. గతంలో ఆమె జరుగుమల్లి మండలంతో పాటు ఒంగోలు దిశా పోలీస్‌స్టేషన్‌లో పని చేశారు. ప్రస్తుతం ఎస్పీ కార్యాలయంలోని స్పందన సెల్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

మద్దిపాడు, మే 25(ఆంధ్రజ్యోతి): నందిపాడులోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరాయకొండ మండలం కె.బిట్రగుంట గ్రామంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా కొందరు ఊరేగింపును అడ్డుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, సునీల్, భరత్, అంజయ్య పాల్గొన్నారు.

నేడు మల్లవరంలో యోగా కార్యక్రమం

● ప్రారంభించనున్న కలెక్టర్

మద్దిపాడు, మే 25(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ దగ్గర ఉదయం 6 గంటలకు యోగా కార్యక్రమాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రారంభిస్తారని ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

మద్దిపాడు, మే 25(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి సంబంధించి 9 గంటల విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు ఏఈ చెన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారికంగా, అనధికారికంగా ఎలాంటి విద్యుత్ కోతలు విధించడం లేదని, లోవోల్టేజ్ సమస్య అధిగమించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అధిక లోడు ఉన్న గ్రామాల్లో ఇప్పటికే సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మిత్రుడికి ఆర్థికసాయం

సంతనూతలపాడు, మే 25(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి తోటి స్నేహితులు అండగా నిలిచి ఆర్థికసాయం అందించారు. మైనంపాడు డైట్ కళాశాలలో 1992-93 బ్యాచ్‌కు చెందిన బూచిరాజు శ్రీనివాసరావు గత కొన్నాళ్లగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో తనతో పాటు టీటీసీ ట్రైనింగ్ పొందిన వారు ఈ విషయం తెలుసుకుని శ్రీనివాసరావును స్వగ్రామం మైనంపాడులో కలిసి పరామర్శించారు. వారు సేకరించిన రూ.65వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో మురళీక్రిష్ణ, శ్రీను, రవిచంద్ర, రోజ్‌లీనా తదితరులు పాల్గొన్నారు.

220 మందికి వైద్య పరీక్షలు

సంతనూతలపాడు, మే 25(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు, ఒంగోలు సర్వనేత్రాలయా సూపర్‌స్పెషాలిటీ రెటీనా కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 220 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. 60 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సీవీఎన్‌లో 200మందికి..

ఒంగోలు కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము అండ్ క్లబ్, ఆస్టర్ రమేష్, నల్లూరి సూపర్ స్పెషాలిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక క్లబ్ ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దాదాపు 200 మందికి వైద్యులు శివకృష్ణ నువ్వుల, రవీందర్‌రెడ్డి, నల్లూరి స్నేహప్రియ, చాగంటిపాటి శ్రీచరణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న కొవిడ్ వేరియంటేషన్ గురించి ప్రజలు ఆందోళన అవసరం లేదన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథరావు, కార్యదర్శి కోడూరి రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు ఆర్.నితిన్‌రాజ్‌రెడ్డి, కోశాధికారి ఆరిగ వీరప్రతాప్, సంయుక్త కార్యదర్శి తోట సాయినవీన్, కార్యవర్గ సభ్యులు కరేటి కిరణ్ బాబు, చక్కా రామకృష్ణారావు, జల్లిపల్లి పూర్ణచంద్రరావు, క్లబ్ మేనేజర్ బి.శివారెడ్డి పాల్గొన్నారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడి

ఒంగోలుక్రైం, మే25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని రెండు స్పాసెంటర్లపై ఆదివారం పోలీసులు ప్రత్యేక బృందాలు దాడి చేశాయి. అద్దంకి బస్టాండ్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో, మంగమూరు రోడ్డులో ఉన్న స్పాసెంటర్‌పై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. రెండు చోట్ల ఐదుగురు మహిళలు, ముగ్గురు పురుషులను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చీమకుర్తిలో రక్తదానం

చీమకుర్తి, మే25(ఆంధ్రజ్యోతి) : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.జవహర్, జి.దేవరాజు, మురళీధర్, భాస్కర్, జయప్రకాష్, అంజనేయులు, చలువాది రమేష్, ఆంజనేయులు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముప్వావారిపాలెం విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చీమకుర్తి, మే25(ఆంధ్రజ్యోతి) : ముప్వావారిపాలెం ప్రాథమిక పాఠశాల(హెచ్‌డబ్ల్యూ) పాఠశాల విద్యార్థులు అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన నాల్గో తరగతి విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా నలుగురు గురుకులాల్లో సీటుసాధించటం నేలపాటి లక్ష్మీప్రణవి, తాళ్లూరి బిందుమాధవి, బక్క సంజనలు చీమకుర్తి గురుకులపాఠశాలకు, బక్క రంజిత్ కుమార్ చుండూరు గురుకులానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థులను హెచ్ఎం మాదాల హనుమంతరావు, ఉపాధ్యాయుడు ముప్పరాజు వెంకట్రావు అభినందించారు.

పొగనారు విత్తనాల కోసం సంప్రదించాలి

ఒంగోలు(రూరల్), మే25(ఆంధ్రజ్యోతి): పొగనారు కోసం అవసరమైన విత్తనాలు కావాల్సిన రైతులు ఈనెల30వ తేదీలోపు ఒంగోలు పొగాకు వేలం కేంద్ర-2లో దరఖాస్తు చేసుకోవాలని వేలం కేంద్రం నిర్వహణాధికారి జె.తులసి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు క్షేత్రసహాయకుల నుంచి సమాచారం పొందవచ్చని కోరారు.

మోదీ విధానాలను ప్రతిఘటించాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండారెడ్డి

కొండపి, మే 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న పీఎం మోదీ విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జీవీ కొండారెడ్డి చెప్పారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పెరిదేపి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుందరయ్య నేటితరం నాయకులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, మండల కార్యదర్శి మల్లెల కొండయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు కోలాటం ప్రదర్శించారు.

ఎయిమ్స్ ప్రవేశ పరీక్షలో 41వ ర్యాంకు




డాక్టర్ వర్షిత

సింగరాయకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎయిమ్స్‌లో పీజీ ప్రవేశానికి నిర్వహించిన ఐఎన్ఐసెట్‌లో మండలంలోని మూలగుంటపాడుకి చెందిన డాక్టర్ కొచర్ల వర్షిత సత్తా చాటారు. 99.956 శాతంతో ఆల్ ఇండియాలో 41వ ర్యాంకు సాధించారు. వర్షిత గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. తండ్రి కొచ్చర్ల ప్రసాద్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆల్‌ఇండియా ర్యాంకు సాధించిన వర్షితను పలువురు అభినందించారు.

వ్యాపార కేంద్రాలుగా ప్రైవేట్ బీఈడీ కళాశాలలు

ప్రైవేట్ బీఈడీ కళాశాలలు వ్యాపార కేంద్రాలుగా మారిపోతున్నాయి. బోధనా తరగతులు మచ్చుకైనా కనిపించటం లేదు. కళాశాలల్లో చేరిన విద్యార్థులు నేరుగా పరీక్షలకు హాజరవుతున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు చోద్యం చూస్తున్నారు. ముడుపులు తీసుకొని అక్రమాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- మచ్చుకైనా కనిపించని బోధనా తరగతులు
- నేరుగా పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు
- చోద్యం చూస్తున్న యూనివర్సిటీ అధికారులు



దర్శి, మే 25(ఆంధ్రజ్యోతి):దర్శిలో 17 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలకు 110 మంది విద్యార్థులను చేర్చుకునే అవకాశం ఉంది. నిబంధనల ప్రకారం మేనేజ్‌మెంట్ కోటాపోను మిగిలిన విద్యార్థులను కౌన్సెలింగ్ ద్వారా కళాశాలల్లో చేర్చుకోవాలి. ఇక్కడ కౌన్సెలింగ్ జరిగిన దాఖలాలు లేవు. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను ఏజెంట్ల ద్వారా నేరుగా చేర్చుకుంటున్నారు. ఏజెంట్లు ఒక్కో విద్యార్థి నుంచి లక్షన్నర రూపాయలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. కళాశాలలు అడిగిన మేరకు చెల్లించి మిగిలిన సొమ్మును దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలు, ఫైనల్ పరీక్షలకు మాత్రమే ఇక్కడకు వచ్చి వెళ్తారు. ఒక్కరోజు కూడా క్లాసులు నిర్వహించటం లేదు. నిబంధనల ప్రకారం ఏడాదిలో 220 రోజులు క్లాసులు నిర్వహించాలి. ఆరు నెలలకు ఒకసారి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. యాజమాన్యం ముఖాముఖి క్లాసులతో నిమిత్తం లేకుండా సెమిస్టర్, ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు ఇదేమిటని ప్రశ్నించిన దాఖలాలు లేవు. పరీక్షల సమయంలో పరిశీలన అధికారులుగా వస్తున్న యూనివర్సిటీకి చెందిన అధికారులు అంతా సక్రమంగా ఉన్నట్లు భావించి పరీక్షలు నిర్వహించి వెళ్తున్నారు. దీంతో బీఈడీ విద్యావిధానం వ్యాపారంగా మారింది.

బీఈడీ చదివిన విద్యార్థులు ఆతర్వాత ఉపాధ్యాయులుగా ఎంపికై భావిభారత పౌరులైన చిన్నారులకు పాఠాలు చెప్పాల్సి ఉంది. ఉపాధ్యాయ వృత్తిలో వచ్చే బీఈడీ విద్యార్థులే చదువులతో పనిలేకుండా దొడ్డిదారిన పరీక్షలు వ్రాసి పాసవుతున్నారు. ఈవిధానం వల్ల విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుదని ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈతంతు కొనసాగుతున్నప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో సమూల మార్పు చేస్తూ విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో కూడా బీఈడీ విద్యను కూడా ప్రక్షాళన చేస్తారని భావిస్తున్నారు.

అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నప్పటికీ కళాశాల విద్యపై పెద్దగా దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఈఏడాదీ గతంలో మాదిరి బోధనా తరగతులు జరగకుండానే పరీక్షలు నిర్వహించారు. విద్యా సంవత్సరం మళ్లీ ఆరంభం కాబోతుంది. బీఈడీ మొదటి సంవత్సరంలో చేర్పేందుకు దళారులు రంగప్రవేశం చేశారు. ఒడిసా, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి ప్రతి ఏడాది వందలాది మంది విద్యార్థులను ఇక్కడ చేరుస్తున్న విషయం తెలిసిందే. కళాశాలల్లో 90శాతం మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. అక్కడ ఇలాంటి అవకాశాలు లేక చదువులతో పనిలేకుండా సర్టిఫికెట్లు పొందవచ్చనే ఉద్దేశంతో మన రాష్ట్రాన్ని ఎంచుకొని చేరుతున్నారు. అందులో ప్రధానంగా మన జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో బీఈడీ కాలేజీలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ అన్నీ కాలేజీల్లో విద్యావిదానం ఇదేతంతులో కొనసాగుతుంది.

భారీగా లబ్ధిపొందుతున్న దళారులు

ప్రైవేట్ బీఈడీ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించటం ద్వారా యాజమాన్యంతో పాటు దళారులు కూడా భారీగా లబ్ధిపొందుతున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి పాస్ గ్యారెంటీ పేరుతో అన్నీతామే చూసుకుంటామని భరోసా ఇస్తూ రూ.1.5 లక్షల చెప్పున వసూళ్లు చేస్తున్నారు. కళాశాలలకు ఒప్పందం ప్రకారం రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. మిగిలిన మొత్తాన్ని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మొత్తాన్ని యూనివర్సిటీ అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నారు. ఈవృత్తి ద్వారా అనేకమంది గత పదేళ్లల్లో కొట్లాది రూపాయలు సంపాదించినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు.

ఇతర ప్రాంతాలనుంచి దర్శికి వచ్చిన ఒక వ్యక్తి పది సంవత్సరాల క్రితం ఎలాంటి పనిలేక ఖాళీగా తిరుగుతుండేవాడు. బీఈడీ కళాశాలకు విద్యార్థులను చేర్పించే కార్యక్రమం చేపట్టారు. అనతికాలంలోనే అనేక రాష్ట్రాల్లో పరిచయాలు ఏర్పాటుచేసుకొని భారీగా విద్యార్థులను కళాశాలల్లో చేర్పిస్తూ భారీ మొత్తంలో సంపాదించినట్లు తెలుస్తుంది. మరోవ్యక్తి ఒక కళాశాలలో గుమస్తాగా పనిచేసేవాడు. అతను బీఈడీ విద్యార్థులను చేర్పించటం ద్వారా ఆర్థికంగా ఎదిగి ఒక బీఈడీ కళాశాలలో వాటాదారుడిగా చేరాడు. ఇలా అనేకమంది దళారులు బీఈడీ విద్యావిధానం ద్వారా భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈవిధానంలో మార్పురాకపోతే భవిష్యత్తులో విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేట్ బీఈడీ కళాశాలల తంతును గమనించి సక్రైనమార్గంలో నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పవన్ కల్యాణ్‌పై వైసీపీ కుట్ర

- ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోబోం
- జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్



మాట్లాడుతున్నజనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్

ఒంగోలు కలెక్టరేట్, మే 25(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వైసీపీ భారీ కుట్ర పన్నిందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ చైర్మన్ షేక్ రియాజ్ ఆరోపించారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా పవన్ కల్యాణ్ సినిమాలు రిలీజ్ సమయంలో అడ్డుకొనేందుకు సినిమా టిక్కెట్ల ధరలు తగ్గించి సినిమాథియేటర్ల వద్ద అధికారులను కాపలా పెట్టారని విమర్శించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ కల్యాణ్ నటించిన హరిహరవీరమల్లు సినిమాను అడ్డుకొనేందుకు వైసీపీ కుట్రపన్నిందని విమర్శించారు.త్రిపురనేని చిట్టిబాబు అనే వ్యక్తి పవన్ కల్యాణ్‌పై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ ముసుగు వేసుకున్న ఇటువంటి నాయకులను సస్పెండ్ చేయాలని కోరారు. అలాగే త్రిపురనేనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. తమ నేత పవన్ కల్యాణ్‌పై అవాకులు, చవాకులు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇకనైనా ఇలాంటి రాజకీయాలు మానుకోకపోతే వైసీపీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీటీఎస్ఏలో జిల్లాకు చోటు



వరకుమార్, అక్కేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో జిల్లాకు చోటు లభించింది. ఆదివారం విజయవాడలో జరిగిన ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీటీఎస్ఏ)లో ఉపాధ్యక్షుడుగా వీవీఎల్ఎన్ వరకుమార్, రాష్ట్ర సెక్రటరీగా బండి అక్కేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ప్రమాణస్వీకారంలో వరకుమార్, అక్కేశ్వరరావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు, ట్రెజరీ ఉద్యోగులు వరకుమార్, అక్కేశ్వరరావులను సత్కరించారు.



ప్రత్యేక అలంకరణలో నాగులస్వామి పుట్ట



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

నాగ, అభయాంజనేయులకు ప్రత్యేక పూజలు

పెద్దారవీడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి శివారులో ఉన్న శ్రీ నాగ అభయాంజనేయస్వాములకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ నాగులస్వామి పుట్ట, అభయాంజనేయస్వామి విగ్రహాలను ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివార్లకు కాయకర్పూరాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

వైభవంగా పోలేరమ్మ ఆదివారం జాతర



పుష్పాల అలంకరణలో పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ శివారులలోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి, నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దవరంలో భూ కబ్జా

- 67 ఎకరాల కొండపోరంబోకు ఆక్రమణ
- ఆపై ఇతర జిల్లాల వారికి విక్రయం
- అందులో మోటార్లు వేసి సాగుకు యత్నం
- అడ్డుకున్న స్థానికులు
- వాహనాలు స్వాధీనం





పెద్దవరంలో ఆక్రమించిన కొండపోరంబోకు భూమి (ఇన్‌సెట్లో) బోర్లు బిగించేందుకు వచ్చిన యంత్రాలు

కురిచేడు, మే 25(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం పెద్దవరం గ్రామంలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నది.దళారులు పొరుగు జిల్లాల వారికి ప్రభుత్వ భూమిని కట్టబెట్టి రూ.లక్షలు దండుకుంటున్నారు. ఈక్రమంలో ఆదివారం ఆక్రమణ దారులను గ్రామస్థులు అడ్డుకుని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

పెద్దవరం గ్రామంలోని 306 సర్వేనంబరులో 600 ఎకరాల కొండపోరంబోకు భూమి ఉంది. పెద్దవరం, దేనకొండ, నమశ్శివాయపురం గ్రామాలవారు పశువులను మేపుకుంటారు. ఇటీవల కొంతమంది దళారులు ఆభూమిని అమ్మే ప్రయత్నాలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం బెల్లంకొండపాలెం గ్రామానికి చెందిన ఓవ్యక్తికి పెద్దవరం గ్రామం కొండపోరంబోకు భూమిలో 67 ఎకరాలను రూ.ఒక కోటికి అమ్మారు. భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి రెండు రోజుల నుంచి బోర్లు వేసి మోటార్లు బిగించారు. ఆదివారం పూజలుచేసి భూమిని సాగు చేసే ప్రయత్నాలు చేశారు. ఈవిషయాన్ని పశువుల కాపరులు గ్రామస్థులకు తెలపడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు.

గ్రామస్థుల సమాచారంతో రెవెన్యూ పోలీస్ అధికారులు సదరు ఆక్రమిత భూమి వద్దకు వచ్చి విచారణ చేశారు. అది ప్రభుత్వ భూమి అని ఎవరూ సాగు చేయవద్దని సూచించారు. వినుకొండకు చెందిన దళారి నందిగామకు చెందిన వారికి కొండపోరంబోకు భూమిని అమ్మారు. వారు బోర్లు వేయడమే కాక మోటార్లు సైతం బిగించారు. ఈక్రమంలో బోర్లు బిగించే మిషన్, జనరేటర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

వేడుకగా హనుమాన్ శోభాయాత్ర

- మేళతాళాలు, కోలాట ప్రదర్శనలు
- హనుమాన్ వేషధారణలతో అలరించిన భక్తులు
- జైశ్రీరామ్ నామస్మరణతో మారుమోగిన నగరం





ఒంగోలు నగరంలో నిర్వహిస్తున్న ఆంజనేయ స్వామి శోభాయాత్ర (ఇన్‌సెట్లో) ఆంజనేయుడి జెండాతో ఓ భక్తుడు

ఒంగోలు కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. నిలువెత్తు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి నగరంలోని పలు ప్రధాన రహదారులలో శోభాయాత్ర చేపట్టారు. యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీ జరిపారు. స్థానిక సంతపేట శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం దగ్గర నుంచి ప్రారంభమైన శోభాయాత్ర శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం వరకు కొనసాగింది. ఇక శోభాయాత్రలో మేళతాళాలు, కోలాటం, శ్రీరాముడు, ఆంజనేయస్వామి వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వందలాది మంది హిందువులు పాల్గొని జైశ్రీరామ్ నినాదాలు చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జునరావు, ప్రాంతీయ సత్సంగ్ ప్రముఖ్ సోమా సుబ్బారావు, భజరంగదళ్ నగర కన్వీనర్ మఠంపల్లి దుర్గేష్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఈమని బలరాం, పలు ధార్మిక సంఘాల ప్రతినిధులు నగేష్, త్రిపుర భైరవేశ్వరానందస్వామి, పెరుమాల్, పసుమర్తి వెంకటేశ్వరరావు శ్రీనివాసగుప్తా, పత్తి దిలీప్, రాజేష్‌వర్మ, మధుయాదవ్, మద్దిరెడ్డి రవీంద్రారెడ్డి, నాగసాయి, రాధా రమణ గుప్తా జంధ్యం తదితరులు పాల్గొన్నారు. పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆదర్శ హెచ్‌ఎంలపై అయోమయం

ఒంగోలు విద్య, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను నియమించడంలో అయోమయం నెలకొంది. ప్రాథమిక పాఠశాలల్లో 59 మందికిపైగా విద్యార్థులున్న పాఠశాలలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా గుర్తించారు. హైస్కూళ్లలో 1నుంచి 0 తరగతులున్న చోట కూడా 1 నుంచి 5 తరగతులకు 40 మందికిపైగా విద్యార్థులు ఉన్న చోట ఆదర్శప్రాథమిక పాఠశాలలుగా గుర్తించారు ఈ పాఠశాలలకు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోస్టు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో 713 పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా గుర్తించారు. యూపీ స్కూళ్లు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ అయిన చోట, హైస్కూళ్లలో కొత్తగా 1నుంచి 5 తరగతులు ప్రారంభించిన చోట 92 పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులకు 40 మందికి పైగా విద్యార్థులు ఉండటంతో ఆ పాఠశాలలను ఆదర్శపాఠశాలలుగా గుర్తించారు. జిల్లాలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు 713, హైస్కూళ్లలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు 92 కలిసి 805 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోస్టులు కేటాయించాల్సి ఉంది. ఈ పోస్టుల కేటాయింపులో ప్రస్తుతం గందరగోళం నెలకొంది.

పీఎస్ హెచ్‌ఎంలుగా స్కూలు అసిస్టెంట్లు

జిల్లాలో మిగులుగా తేలిన స్కూలు అసిస్టెంట్లను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలుగా నియమించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. యూపీ స్కూళ్లడౌన్‌గ్రేడ్, హైస్కూళ్లలో 3,4,5 తరగతులను వెనక్కు పంపించిన కారణంగా గణితం, ఇంగ్లీషు, ఇతర సబ్జెక్టుల స్కూలు అసిస్టెంట్లు మిగులుగా తేలారు. వీరిలో 509 మంది పీఎస్ హెచ్‌ఎంలుగా నియమించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మిగిలిన 296 పాఠశాలలకు గతంలో మంజూరైన ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పోస్టులను సర్దుబాటు చేశారు. అయితే జిల్లాలో సుమారు 700 మంది స్కూలు అసిస్టెంట్లు మిగులుగా తేలారు. వీరిలో ఎవరిని ఆదర్శ పాఠశాలలకు హెచ్‌ఎంలుగా నియమిస్తారో స్పష్టత లేదు. దీంతో మిగులుగా తేలిన స్కూలు అసిస్టెంట్లు అందరూ ప్రస్తుతం స్కూలు అసిస్టెంట్ల బదిలీలకు దరఖాస్తు చేశారు. అయితే ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలుగా నియామకంపై రకరకాలుగా ఊహాగానాలు వస్తుండటంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

3 కిలోమీటర్లు బాగులేక 30 కి.మీ దూరం ప్రయాణం

- ఐదేళ్ల వైసీపీ పాలనలో మూర కూడా వేయలేని దుస్థితి
- గతంలో టీడీపీ హయాంలో రూ.6కోట్లతో 6 కి.మీ పూర్తి
- చాపలమడుగు - చెన్నంపల్లి - దొనకొండ రోడ్డు పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న చెన్నంపల్లి గ్రామస్థులు
- బాగుచేయాలని కోరుతున్న ప్రజలు



చెన్నంపల్లి వద్ద అధ్వానంగా చాపలమడుగు - దొనకొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు

పుల్లలచెరువు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా మూరకు గుంత... బారకు ఒక బురద కయ్యలుగా రోడ్లు కనిపిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు మండలంలోని పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్డులు బురద మాగాణిలను తలపిస్తున్నాయి. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్డుల్లో ప్రయాణం చేయాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.

చాపలమడుగు - దొనకొండ రోడ్డును పట్టించుకోని వైసీపీ

ప్రధానంగా చాపలమడుగు - చెన్నంపల్లి - దొనకొండకు టీడీపీ ప్రభుత్వ హయంలో భారీగా నిధులు కేటాయించి పంచాయతీరాజ్ రోడ్లను ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చారు. గత 70 ఏళ్లుగా రోడ్డులేక ఇబ్బందులు పడుతున్నా బాధలను చూసి అప్పటి టీడీపీ ప్రభుత్వం చెన్నంపల్లి కోసం చాపలమడుగు నుంచి చెన్నంపల్లికి 3 కిలో మీటర్లు, త్రిపురాంతకం మండలం మిట్టపాలెం నుంచి చెన్నంపల్లి సమీపంలోని పొలాల వరకు మొత్తం 6 కిలో మీటర్లు పూర్తి చేశారు. మొత్తం 9 కిలో మీటర్ల రోడ్డులో మధ్యలో నిధుల కొరతతో 3 కిలో మీటర్లు నిలిచిపోయింది. దీంతో నిత్యం త్రిపురాంతకం, పుల్లలచెరువు వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. మూడు కిలోమీటర్లు రోడ్డు వేయకపోవడంతో వర్షం పడినప్పుడు బురద మాగాణిని తలపిస్తుంది. దీంతో ఆ దూరం ప్రయాణం చేయలేక వాహనదారులు ఎర్రగొండపాలెం మీదుగా 30 కిలో మీటర్లు ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించి మిగతా రోడ్డును పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

175 మందికి వైద్య పరీక్షలు

గిద్దలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శంకర నేత్రాలయం వైద్యులు ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 175 మంది రోగులను పరీక్షించారు. వారిలో 150 మందికి సుక్లాలు, ఇతర ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. వీరందరికీ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ రాచకొండ గ్రామ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

పుల్లలచెరువు,మే 25(ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాచకొండ గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా జిడ్డు వెంకటేశ్వర్లు ఎన్నికైయ్యారు. ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు వెంకటేశ్వర్లును గ్రామ పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు శనగా నారాయణ రెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మునగాల రామిరెడ్డి ఆయనను అభినందించారు.



పుల్లలచెరువు రోడ్డుపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న మార్జిన్లు

మార్జిన్‌కు మరమ్మతులు మరిచారా..?

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఎర్రగొండపాలెం రూరల్ మే 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ రోడ్ల మరమ్మతులను గత ఐదేళ్ల పాలనలో వైసీపీ పాలకులు మరిచారు. దీంతో రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. చిన్న గుంతలు కాస్తా పెద్దవి అవడంతోపాటు రోడ్డు మార్జిన్‌లు సైతం కోతకు గురయ్యాయి. దీంతో ఈ దారిన రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా రోడ్డు బాగుపడలేదని ప్రయాణికులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే రోడ్లకు మరమ్మతులు చేయిస్తామని చెప్పినప్పటికీ ఇక్కడ నోచుకోలేదు. ఎర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం-త్రిపురాంతకం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును చూస్తే భయమేస్తోంది. ఈ రోడ్డును బాగుచేయాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంగా మార్జిన్‌లు ధ్వంసం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆ రెండు రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కుట్టుమిషన్ల అందజేత

గిద్దలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రేమ సుధా మందిరం ఆవరణలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు నలుగురికి కుట్టుమిషన్లు, ఇద్దరికి వీల్‌చైర్లను అందజేశారు. మాతృశ్రీ ఈశ్వరమ్మ జన్మ దినోత్సవం సందర్భంగా జరిగిన ఈకార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు టి.రామిరెడ్డి, గిద్దలూరు శాఖ కన్వీనర్ సూరె అనంతరామయ్య, మహిళా విభాగం జిల్లా కోఆర్డినేటర్ శశికళ, నరవ కమిటీ కన్వీనర్ బాలక్రిష్ణారెడ్డి, సత్యసాయి సేవా సంస్థల జిల్లా కోఆర్డినేటర్ రామ్మోహన్‌రావు, సేవా కోఆర్డినేటర్ భిక్షం, భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘ జిల్లా కార్యదర్శి కల్పన

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

గిద్దలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయం ఆవరణలో ఆశా వర్కర్ల యూనియన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పి.కల్పన మాట్లాడుతూ పోరాటాల ద్వారానే హక్కులు వస్తాయన్నారు. ఆశాల కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన ఆశాలకు పింఛన్, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గతంలో చేసుకున్న ఒప్పందాల జీవోలను అమలు చేయాలని కోరారు. జూన్ 7, 8 తేదీల్లో జిల్లా స్థాయిలో జరుగుతున్న శిక్షణ తరగతులకు ఆశాలు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు నూర్జహాన్, అంజలి, కుమారి, రాజామణి పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో ఎంతో ఉపయోగం

మార్కాపురం వన్‌టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరం అని లయన్స్ క్లబ్ మార్కాపురం శాఖ అధ్యక్షుడు టీవీ రామకృష్ణారావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులను ఆదివారం సందర్శించి రామకృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులలో పఠనాశక్తి, మేథోసంపత్తి పెంపునకు వేసవి విజ్ఞాన తరగతులు దోహదపడతాయన్నారు. ఈ శిక్షణలో చిత్రలేఖనం, చదరంగం, పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, వివిధ ఆటలు ఆడటం వల్ల ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు శివారెడ్డి, ఉపాధ్యాయులు రవిశేఖర్ రెడ్డి, కోటా శ్రీనివాసరావు, తిరుపాలయ్య పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన పూర్వవిద్యార్థులు

తర్లుపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. మొత్తం 90 మంది విద్యార్థులు ఆనందోత్సవంలో మునిగిపోయారు. 25 ఏళ్ల కిందట చదువుకున్నప్పుడు చేసిన వారి అల్లరి, ఆట, పాటలు, తమ స్నేహితులతో కలిసి గుర్తుచేసుకున్నారు. అనంతరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాసేపు బాల్యంలోకి వెళ్లి ఆనందోత్సవంలో విహరించారు. అనంతరం గురువులైన జె.కృష్ణమూర్తి, ఎస్‌సీ కృష్ణారెడ్డి, హనివిలాసిని, కృష్ణమూర్తిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పూర్వపు విద్యార్థులు సుబ్రహ్మణ్యం, శేషు, వెంకట్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి తమ బ్యాచ్ తరఫున కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఎస్ఎంసీ చైర్మన్ రాజారాపు రామిరెడ్డి, ఉపాధ్యాయులు గోసు శ్రీనివాసులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బేస్తవారపేటలో..



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బేస్తవారపేట : బేస్తవారపేట శ్రీ సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో 1993-94 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో కలిశారు. నాడు ఈ పాఠశాలలో చదువుకున్నవారు ప్రస్తుతం పలు రంగాల్లో స్థిరపడ్డారు. చాలా ఏళ్ల తర్వాత వారంతా తాము చదువుకున్న పాఠశాలకు రావడంతో వారి ఆనందం అవధులు దాటింది. ఒకరినొకరు పలుకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలు, ప్రస్తుత పరిస్థితులు, కుటుంబ వివరాలను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు అన్నెం ఇంద్రసేనారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామన్ సింగ్, కృష్ణవేణి, తోట రమణ పాల్గొనగా పూర్వ విద్యార్థులు వారిని సన్మానించారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలి

పుల్లలచెరువు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని త్రైతసిద్ధాంత - ప్రబోధ సేవా సమితి హిందు జ్ఞాన వేదికదొనకొండ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం పుల్లలచెరువు మండలంలోని కొత్తూరు, నాయుడుపాలెం, పిడికిటివారిపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజలు అజ్ఞానం వీడి జ్ఞానం వైపు అనగా దైవం వైపు ప్రయాణించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏడుకొండలు, చెన్నకేశవులు, బాలరంగయ్య, నవీన్‌కుమార్, భార్గవి, కాశిలక్ష్మి, సరస్వతి, సీతమ్మ, పాల్గొన్నారు.

మహానాడును జయప్రదం చేయండి

శ్రేణులకు టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పిలుపు



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


ఎర్రగొండపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరిగే మహానాడు బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 5000 ఐదు వేలకు పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి జయప్రదం చేయాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి పంచాయతీ నుంచి ఒక బస్సు కడపకు బయలుదేరుతుందని చెప్పారు. గతంలో ఒంగోలులో జరిగిన మహానాడుకు ఇక్కడి నుంచి భారీగా తరలివెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. చిత్తూరు జిల్లా టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు సీఆర్ రాజన్ మాట్లాడుతూ మళ్లీ అధికారంలోకి వస్తానని జగన్‌రెడ్డి ప్రజలను మభ్యపెట్టే మాటలు నమ్మి ప్రజలు ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చే ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లను ఎంఎల్‌సీ, ఎంపీపీలు, సర్పంచులను అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు. భారీ సంఖ్యలో తరలివెళ్లి మహానాడును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, ఐదు మండలాల నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం రాజన్, ఎరిక్షన్‌బాబును సన్మానించారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

పొదిలి, మే 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీని తిరిగి రేషన్ డీలర్లకు అప్పగించడంపై మండల డీలర్లు ఆదివారం పొదిలిలో డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం డీలర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌస్ బాషా మాట్లాడుతూ డీలర్లను కాదని జగన్‌రెడ్డి ఇంటింటికీ బియ్యం పంపిణీ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. టీడీపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు చేపట్టడంతోపాటు తిరిగి డీలర్లకు ఆ బాధ్యతను అప్పగించడం హర్షణీయమన్నారు. దీనివలన రాష్ట్ర వ్యాప్తంగా 29వేల మంది డీలర్లకు ప్రయోజనం చేకూరుతుందని ఆనందం వ్యక్తం చేశారు. మాపై నమ్మకంతో తిరిగి అప్పగించడానికి కృషి చేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అంతే కాకుండా వాహన ఆపరేటర్లకు ఉచితంగా వాహనాలను వారికే అప్పగించారన్నారు. కార్యక్రమంలో పొదిలి మండల డీలర్ల అధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, డీలర్లు మట్టా నరసింహారావు, మస్తాన్‌వలి, కాశిరెడ్డి, ఆదిరెడ్డి, నరసారెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, విలేకరి శ్రీను, అనీల్, కాటూరి శ్రీనివారావు, సింహాద్రి పాల్గొన్నారు.




సన్మాన గ్రహీతలతో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘ నేతలు

నామినేటెడ్ పదవులు పొందిన వారికి సన్మానం

కంభం, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విజయానికి కృషి చేసిన గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో నామినేటెడ్ పదవులు వచ్చిన బలిజ సంఘీయులను శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం వారు ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంభం కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన దుత్తా బాలీశ్వరయ్య, కంభం చెరువు ఆయకట్టు నీటి సంఘం చైర్మన్ పార్శ ఆదినారాయణ, శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీలక్ష్మీమాధవ స్వామి దేవస్థాన చైర్మన్ డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసులు, చిన్న కంభం వీరభద్ర దేవాలయ చైర్మన్ బండారు నెమలిగుండం, కంభం, గిద్దలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్లు బెల్లంకొండ పావని, బెల్లంకొండ సుధ, జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి గజ్జలకొండ నారాయణ, సొసైటీ బ్యాంక్ చైర్మన్ సందు వరలక్ష్మి, గుర్రాల రామక్రిష్ణ తదితరులను ఘనంగా సన్మానించారు. అలాగే కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల 10వ తరగతి, ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను బలిజ సంఘం ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, కార్యదర్శి ఉదయగిరి మల్లికార్జునరావు, అధ్యక్షుడు పగిడి వెంకటరమణ, గల్లా గోవిందయ్య, శెట్లం వేణుగోపాల్ సన్మానించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

మార్కాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని మార్కాపురం టూటౌన్ ఎస్సై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు అన్నారు. 13వ వార్డులో ఆదివారం ప్రజలకు చట్టాలపై, పలు రకాల నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజమోహన్‌రావు మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్కువ వడ్డీకి రుణాలిస్తామని, చిట్టీల పేరుతో మోసాలు ఎక్కువయ్యాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలాన్నరు. కార్యక్రమంలో పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న నాయకులు

టీడీపీ వైపాలెం పట్టణ నూతన కమిటీ ఏకగ్రీవం

ఎర్రగొండపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా పెరుమాళ్ల మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల వెంకటేశ్వర్లుగౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జిగా షేక్ మస్తాన్‌వలి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావులు నూతన కమిటీని అభినందించారు. టీడీపీ విభాగం ఆర్యవైశ్యనాయకులు పాల్గొని కమిటీ నాయకులను ఘనంగా సన్మానించారు.

వైపాలెం, త్రిపురాంతకంలో భారీ వర్షం

ఎర్రగొండపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు వర్షం కురిసింది. ఈ వర్షంతో భూమి పదును అవుతుందని, మెట్ట పైర్లకు విత్తుకోవచ్చని రైతులు అంటున్నారు. ఏప్రిల్, మే మొదటివారంలో సాగుచేసిన పత్తి మొక్కలకు, పండ్ల తోటలకు జీవం పోసిందని రైతులు ఊరట చెందారు. ఉక్కపోతతో ఉన్న ప్రజలు వర్షంతో సేదతీరారు.

త్రిపురాంతకంలో..

త్రిపురాంతకం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో 2 గంటలు భారీ వర్షం కురిసింది. సాగులో ఉన్న వేసవి పత్తి పైరుకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు తెలిపారు. ఈ సంవత్సరం ఖరీఫ్ వర్షాలు ముందుగానే కురుస్తుండడంతో మండలంలో రైతులు ఉత్సాహంగా ఉన్నారు.

దాతృత్వం చాటుకున్న కాశీరావు



బంక్‌ను ప్రారంభించిన దాత కాశీరావు

తర్లుపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడులోని నిరుపేద కుటుంబంలో జన్మించి దివ్యాంగుడైన ఎస్‌కే షాకీర్‌కు జీవనోపాధి కల్పించేందుకు వెలుగు కాశీరావు (సాఫ్ట్‌వేర్ ఉద్యోగి) దాతృత్వం చాటుకున్నారు. నిరుపేదైన షాకీర్‌కు జీవనోపాధి లేకపోవడంతో బంకును చేయించి అందులో చిరువ్యాపారం చేసుకునేందుకు అవసరమైన సరుకులను కొనుగోలు చేయించారు. ఈ సందర్భంగా కాశీరావు మాట్లాడుతూ.. షాకీర్ జీవనోపాధికి ఈ బంకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కాశీరావును పలువురు జనసేన పార్టీ, టీడీపీ నాయకులు అభినందించారు. బంకును ప్రారంభించి ప్రత్యేక నమాజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల యూత్ అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ..బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కాశీరావు తర్లుపాడు అభివృద్ధికి కృషి చేయటం అభినందనీయం అన్నారు. ఇటీవల పెనుగాలులకు ఎస్సీపాలెంకు చెందిన ఆదాం ఇంటి రేకులు లేచిపోతే ఆర్థిక సాయమందించారన్నారు. తర్లుపాడు పోలీస్ స్టేషన్‌కు రూ.2లక్షల విలువ చేసి డ్రోన్ కెమెరాను విరాళంగా అందించారు. ఇలా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న కాశీరావును దాతలు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు ముప్వ సురేశ్, సూరె సువర్ణ, కె.సునీల్, జి.మహేశ్, కె.మోశా, మోహన్, టీడీపీ నాయకులు అబ్బు, కాశీం, ఓం పాల్గొన్నారు.

వార్డు స్థాయి నుంచి బీజేపీని బలపరచాలి



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణారావు

మార్కాపురం వన్‌టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు, పట్టణాల్లో వార్డు స్థాయి నుంచి బీజేపీని బలపరచాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు అన్నారు. బీజేపీ కార్యాలయంలో పలువురు ఆదివారం పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించిన కృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న పరిపాలన పట్ల ప్రజలందరూ ఆకర్షితులవుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో లింగయ్య, మీరావలి, సాంబ, కొండలు, పవన్ నాయుడు, షేక్ బాషా, దేశబోయిన శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మద్దెల లక్ష్మి, సతీష్, శివప్రసాద్ రాజు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ నూతన కార్యవర్గం

కంభం, మే 25 (ఆంధ్రజ్యోతి): కంభం పింఛనర్ల భవనంలో ఆదివారం జరిగిన కంభం తాలూకా ఏపీజీఈఏ ఎన్నికల్లో కంభం తాలూకా ప్రెసిడెంట్‌గా అటవీశాఖ డిప్యూటీ రేంజి అధికారి ముక్కు ప్రసాద్‌రెడ్డి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఆర్డీ ప్రకాశ్, సెక్రటరీగా ఎస్.రంగస్వామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.శివనాగప్రసాద్, ట్రెజరర్‌గా ఎస్.వెంకటరంగయ్యతోపాటు 7 మంది వైస్ ప్రెసిడెంట్లు, 8 మంది జాయింట్ సెక్రటరీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి కె.పాండు రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం పరిశీలకులుగా మార్కాపురం యూనిట్ ప్రెసిడెంట్ కె.చెంచిరెడ్డి, కనిగిరి యూనిట్ ప్రెసిడెంట్ రమేష్‌బాబు, జిల్లా యూనియన్ నాయకులు మసూద్‌అలీ, ఎస్.వి.రమణరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పొదిలి, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కొనకనమిట్ల మండలం మొట్టువారిపల్లె గ్రామానికి చెందిన మొట్టు మాధవరెడ్డి (36) పట్టణంలోని లాడ్జీలో పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి పొదిలి ఆర్టీసీ డిపో ఇన్‌గేట్ వద్ద నిలబడి ఉండగా, మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్తున్న మార్కాపురం డిపో బస్సు మాధవరెడ్డిని ఢీకొట్టి డిపోలోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మాధవరెడ్డి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని, మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతనికి భార్య అనూష, పాప ఉన్నారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందిన సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లంగా చూడమ్మ గంగమ్మ తల్లి అని భక్తులు వేడుకున్నారు. గంగమ్మ తల్లిపై భక్తితో దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమని పూజించారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లిని భక్తులు దర్శించుకోగా, వాహనదారులు వాహన పూజలు చేయించారు. కొందరు గంగమ్మ తల్లికి కానుకలుగా విరాళాలు సమర్పించారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి, బాలరాజు అమ్మవారికి పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఆర్‌పి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాములోరి కల్యాణం

పామూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరభద్రాపురం గ్రామంలోని శ్రీకోదండరామ స్వామి దేవస్థానంలో సీతారామ కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయదాతలైన పువ్వాడి రామకృష్ణ దంపతులు కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సహ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఏలూరి వెంకటేశ్వర్లు, సర్పంచ్ పువ్వాడి జయమ్మ, తిరుపతమ్మ, చినలక్ష్మయ్య, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవస్థాన వార్షికోత్సవం

సీఎస్‌పురం(పామూరు), మే 25 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురంలోని డీజీపేట రోడ్డులో నిర్మించిన శ్రీ గంగమ్మతల్లి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంగిశెట్టి పీరయ్యనాయుడు, ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), మే 25 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి విరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. స్వామివార్లకు మహా నైవేద్యాన్ని ఆలయ గోపురం వద్ద నుంచి మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణలు చేసి సమర్పించారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొమ్మినేని చిన్నఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం

పామూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామానికి చెందిన యాగటీల కొండమ్మ అనే పేద మహిళ కంటి చూపు కానరాక ఇబ్బందులు పడుతుంది. వైద్య అవసరాల నిమిత్తం మానవతా సంస్థ తరుపున రూ.5 వేల నగదును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం.ముసలయ్య, పాలపర్తి వెంకటేశ్వర్లు, వి.వెంకటేశ్వరరెడ్డి, టి.రమేష్, పి.మాల్యాద్రి, టి.సుబ్బారావు పాల్గొన్నారు.

పామూరులో శాకాహార ర్యాలీ

పామూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : శాకాహారం అమృతాహారంతో సమానమని సంస్థ అధ్యక్షుడు పి.అల్లూరయ్య తెలిపారు. స్థానిక పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శాకాహారం ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని పలుప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పి.తిరుపతిరెడ్డి, పి.సౌభాగ్యమ్మ, అనసూయ, దుర్గా, మస్తానమ్మ, ప్రభాకర్, విజయ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

పామూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీటీసీ బొల్లా నరసింహారావు సూచించారు. ఆదివారం స్థానిక మహాలక్ష్మి మిల్క్ ప్రొడక్ట్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన సయ్యద్ అమీర్‌బాబు, ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నొస్సం నాగేంద్రచారి, తెలుగు యువత అధ్యక్షుడు మెంటా నరసింహారావును సన్మానించారు. కార్యక్రమంలో పోకా వినోద్, మహేష్, ఎం.రమణయ్య, షేక్ నజీర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లనివారు నీతులు చెప్పడమా..!

» టీడీపీ నేతలు ఎద్దేవా


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు

దర్శి, మే 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి వెళ్లి ప్రజల సమస్యలపై చర్చించేందుకు భయపడుతున్న వ్యక్తులు నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ దర్శి మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా ధ్వజమెత్తారు. ఆదివారం దర్శిలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు రాజకీయ ఉనికి కోసం రైతులను అడ్డుపెట్టుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇప్పటికే పొగాకు కంపెనీలతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర లభించేవిధంగా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రూ.150 కోట్ల నష్టాన్ని భరాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈనేపథ్యంలో ప్రజలు ఎక్కడ మర్చిపోతారో అనే భయంతో పొగాకు రైతులను ఉద్ధరిస్తామని వైసీపీ నాయకులు బయలు దేరటం శోచనీయమన్నారు. అధికారం కోల్పోయి 11 సీట్లకే పరిమితమైనప్పటికీ ఇంకా వారిలో జ్ఞానోదయం కల్గలేదన్నారు.

టీడీపీ కూటమి ప్రభుత్వం హయాంలో దర్శి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక స్థానిక ఎమ్మెల్యే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. తాను అనుకున్నంత మంచివాడిని కానని ఆయనే స్వయంగా చెప్పుకుంటున్నారని టీడీపీ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. వైసీపీ నాయకులు మంచివారు కారని ప్రజలు ఇప్పటికే తెలుసుకున్నారని, ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు శరవేగంతో సాగుతున్నాయన్నారు. గత వైసీపీ పాలనలో ఐదు సంవత్సరాలు అభివృద్ధి పథకాలను మూలనపడేసిన నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ దర్శి పట్టణ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు కె.వెలిగొండారెడ్డి, మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, నారపుశెట్టి మధు, గొర్రె సుబ్బారెడ్డి, జూపల్లి కోటేశ్వరరావు, గుర్రం బాలకృష్ణ, కల్లూరి సుబ్బు, వెంకటనారాయణ, మాగం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

దొనకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రబాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ దేవాలయంలో శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, గ్రామస్థులు డాక్టర్ లలిత్‌సాగర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగులపాటి శివకోటేశ్వరరావు, షేక్ తోహీద్, తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరావాలి

దొనకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడుకు అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని యర్రబాలెం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోడి ఆంజనేయులు గృహంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఈనెల 27 నుంచి 29వ తేది వరకు మహానాడు జరుగుతుందన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో నాగులపాటి శివకోటేశ్వరరావు, షేక్ తోహీద్, కొమ్మతోటి సుబ్బారావు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, పత్తి వెంకటేశ్వర్లు, మన్నెం గాలయ్య, నిమ్మకాయల సుబ్బారెడ్డి, విప్పర్ల లక్ష్మీరావు, తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్, టీడీపీ నాయకులు

రహదారిని కమ్మేసిన చిల్లచెట్లు

» సుంకరవారిపాలెం - మారెళ్ళ మార్గంలో తరచూ ప్రమాదాలు

ముండ్లమూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరవారిపాలెం నుంచి మారెళ్ళ వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారిని చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో వాహనచోదకులకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ రహదారిపై ప్రయాణం అంటేనే వాహనచోదకులు భయపడుతున్నారు. దాదాపు కిలోమీటరు పొడవుగల రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు అల్లుకుపోయాయి. ఎదురువచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. మారెళ్ళ, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, జమ్ములమడక, మక్కెనవారిపాలెంతోపాటు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయునిపాలెం, పువ్వాడ, మారెళ్ళవారిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు అద్దంకి వెళ్ళాలంటే ఈరహదా పైనే నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. కొంతమంది వాహన చోదకులు రాత్రుల సమయాల్లో చిల్లచెట్లతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చిల్ల చెట్లను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


సుంకరవారిపాలెం- మారెళ్ళ రహదారిని కమ్మేసిన చిల్లచెట్లు

కేంద్రం నియంత్రణలోకి 'ఉపాధి'

» యుక్తధార యాప్ అమలు

» ప్రతి పనిని నమోదు చేయాలని ఆదేశాలు


ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

పామూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం పనులు సాగుతున్నాయి. ఇకనుంచి కేంద్ర ప్రభుత్వం అన్నిస్థాయిల్లోనూ తమ ఆధీనంలో ఉండేలా చర్యలు చేపట్టనున్నది. రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఇక నామమాత్రంగానే ఉండబోతున్నదని ఈ పథకాన్ని అమలుచేస్తున్న అధికారులు స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకొనేందుకు కేంద్రం యుక్తధార అనే యాప్‌ను రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించేందుకు 2005లో ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించేవారు. ఎంపీడీవో, ఏపీవోలు పర్యవేక్షించేవారు. పనుల కల్పన, బిల్లుల చెల్లింపులన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కొనసాగేవి.

అయితే, కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యుక్తధార యాప్ ద్వారా ఇప్పటివరకు ఈపథకం ద్వారా జరుగుతున్న విధానాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. ఎలాంటి పనులు జరుగుతున్నాయి, ఏ ప్రాంతంలో ఏ పని ఎప్పుడు చేయాలి, అంచనాల రూపకల్పన, బిల్లుల చెల్లింపులు తదితర అంశాలన్నింటినీ యుక్తధార యాప్ ద్వారా ఢిల్లీలో కూర్చొని కేంద్ర ప్రభుత్వ అధికారులు నిర్ణయించనున్నారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి అవసరమైన బడ్జెట్ ఆమోదం తెలుపుతుంది. కూలీలు చేయాల్సిన పనులన్నీ కేంద్రమే గుర్తిస్తుంది. వారికి నగదును నేరుగా కేంద్రమే బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది.

ఇప్పటికే అమలులో ఉన్న యుక్తధార యాప్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి పర్యవేక్షించనుంది. దీనివల్ల కూలీలకు బిల్లుల జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు జమయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

మూగజీవాల దాహార్తి తీరుస్తున్న నీటి తొట్టెలు

తాళ్లూరు, మే 25(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన నీటి తొట్లు సత్ఫలితాలిస్తున్నాయి. మండలంలోని గ్రామాల్లో మొదటివిడతగా 14 నీటి తొట్లు మంజూరుచేయగా ఇప్పటికే పది పూర్తయి మూగజీవాల దాహార్తి తీరుస్తున్నాయి. ఒక్కో తొట్టి నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.35 వేలు మంజూరయ్యాయి. కాలువలు, చెరువులు నీటి సదుపాయం లేనిచోట్ల బోర్ల ద్వారా తొట్లను నింపుతున్నారు. గతంలో ఉదయం పొలాలకు వెళ్లిన మూగజీవాలకు అక్కడ నీటి సదుపాయంలేక ఇంటికి చేరుకునేవరకు పొలాల్లో నీటి లభ్యత లేక దాహార్తితో సా యంత్రం వరకు అలమటిస్తూ ఉండేవి. కొన్ని జీవాలు మధ్యాహ్నం 2గంటలకే దాహార్తితో ఇళ్లకు చేరుకునేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మూగజీవాలకోసం నిర్మిస్తున్న నీటి తొట్ల వద్ద దాహార్తి తీర్చుకుంటూ సాయంత్రం ఇళ్లకు చేరుకుంటున్నాయి. ఇలాంటి పథకాలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు.


మాధవరం వద్ద నీటి తొట్టెలో నీరు తాగుతున్న గొర్రెలు

యోగాతో మానసిక ఉల్లాసం

దర్శి, మే 25(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ వై. మహేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దర్శిలో ఆదివారం యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. స్థానిక ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌లో కమిషనర్ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ యోగా, ఆసనాలు నేర్చుకోవాలని సూచించారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం నాటికి అధిక సంఖ్యలో ప్రజలు యోగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ గొర్రెపాటి వేణు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో.. సీఎస్‌పురం(పామూరు) మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ఆరోగ్యంతో పాటు ఉల్లాసం ఏర్పడుతుందని ఎస్.వెంకరామయ్య విద్యార్థులకు సూచించారు. ఆదివారం సీఎస్‌పురంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకుడు అళ్ల భాస్కరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు, కర్రసాములో మెలకువలు, కళ్లకు గంతలు, నృత్యాలు నేర్పించారు. కార్యక్రమంలో ఓబులరెడ్డి, కె.భారతి పాల్గొన్నారు.


దర్శిలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు

29 నుంచి భూసార పరీక్షలు

దర్శి, మే 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి భూసార నీటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అధికారి డాక్టర్ జి.రమేష్ తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశాల మేరకు రైతులకు సాంకేతిక అధునాతన పరిజ్ఞానం అందించి చైతన్యవంతులను చేయటం జరుగుతుందన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఖరీఫ్‌లో పైర్లు సాగుచేసే రైతులు పంటల యాజమాన్యం, సస్యరక్షణ విధానంలో మెలకువలు తెలుసుకోవాలన్నారు. పాడి రైతులు పశువుల యాజమాన్య పద్ధతులను అవలంభించాలని సూచించారు.

బెల్టు షాపుపై దాడి

ముండ్లమూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్ పోలీసులకు ఆదివారం సమాచారం అందటంతో ఒంగోలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో దాడి చేశారు. గ్రామానికి చెందిన ప్రసన్నాంజనేయులు అనే వ్యక్తి బెల్టు షాపు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంమేరకు పోలీసులు దాడులు చేసి 85 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈదాడుల్లో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ మౌలాలి, రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. నిర్వాహకుడిని దర్శి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు

ముండ్లమూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి మరొకరిని ప్రమాదానికి గురి చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్‌ఐ కె.కమలాకర్ అన్నారు. ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇద్దరు వాహన చోదకులు మద్యం తాగినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు హనుమంతరావు, ఎన్.వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

పీసీపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): కష్టజీవుల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకుడు పి.మహేష్ అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి వారోత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలోని పెదయిర్లపాడులోని ఆదిఆంధ్ర కాలనీలో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ సుందరయ్య కృషి వల్లే వ్యవసాయ కార్మికులకు కనీసవేతన చట్టాన్ని ప్రభుత్వం అమలుచేసిందని అన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్య విద్యార్థులు ప్రేమ్‌చంద్, ధ్యాన్‌చంద్‌లు వడదెబ్బ నివారణ కోసం హోమియో మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏలియా, మోషే, ఆనందరావు, హిమానియల్, శాంసన్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక క్షేమం

తాళ్లూరు, మే 25(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు వివాహం చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండగా ఇష్టం లేక ఇంటినుంచి వెళ్లిన బాలికను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆదివారం ఒంగోలు బాలల సదనంకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని ఓగ్రామానికి చెందిన చెందిన బాలిక కన్పించకుండా పోవటంతో కుటుంబీకులు ఈనెల 18న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు బాలిక అదృశ్యంపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గత వారం రోజులుగా పోలీసులు విచారణ చేయగా, సంతమాగులూరు మండలంలోని తమ బంధువుల ఇంటి వద్ద ఉన్నట్టు గుర్తించారు. ఈనెల 24 వతేదీ రాత్రి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులతో బాలికను మాట్లాడించి సంరక్షణ నిమిత్తం ఒంగోలు బాలల సదనంకు తరలించారు.

సీఎస్‌పురంలో మోస్తరు వర్షం

పామూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం, పామూరు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం కురిసి వాతావరణం చల్లబడటంతో ఉపశమనం చెందారు. సీఎస్‌పురంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

దర్శి, మే 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దర్శిలో నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కె.గురవాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల్లో పేద విద్యార్థులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధిక మార్కులు సాధించి ఉన్నత చదువులకు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, కంచర్ల శ్రీనుబాబు, రమేశ్వరాచారి, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం

ముండ్లమూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున ఉరుములు, పిడుగులతో పాటు భారీ వర్షం కురిసింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన తొట్టెంపూడి ధనలక్ష్మికి చెందిన ఇంటి మీద పిడుగుపడి పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్, కూలర్, కరెంటు సామాన్లు కాలిపోయాయి. అదేగ్రామానికి చెందిన చింతల చంద్రయ్య, పందిరి ఏసు, చింతల మల్లయ్య, తొట్టెంపూడి వెంకటరావు, కూరపాటి శంకర్, తొట్టెంపూడి కోటేశ్వరి, తొట్టెంపూడి శ్రీనివాసరావుకు చెందిన ఇళ్ళల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, విద్యుత్ మీటర్లు, బల్బులు దగ్ధమయ్యాయి. రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటి ల్లింది.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ఒంగోలు కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక భాగ్యనగర్‌లోని సంఘ కార్యాలయంలో ఎన్నికల అధికారిగా డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యం, సహాయ ఎన్నికల అధికారిగా కె.రమణ, ఇ.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అయితే పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావ డంతో కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోమటిగుంట వెంకటేశ్వర్లు (రెవెన్యూ), సహాధ్యక్షులుగా అలేటి నాగయ్య(ఇరిగేషన్), ఉపాధ్యక్షులుగా గర్నెపూడి యోబు(ఆర్‌అండ్‌బీ), ముప్పరపు వెంకయ్య(వ్యవసాయ శాఖ), కార్యదర్శిగా డి.ప్రేమ్‌నాథ్(సోషల్ వెల్ఫేర్), సంయుక్త కార్యదర్శులుగా బీవీ సుబ్బారావు(రెవెన్యూ), ఫులుకూరి దేవకుమారి(కోఆపరేటివ్), ప్రచార కార్యదర్శిగా శాసనాల రమాదేవి, కోశాధికారిగా జి.సుబ్బరాయుడు(వ్యవసాయశాఖ)ను ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు.

ఘనంగా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం

ఒంగోలు కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘ ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక వైశ్యభవన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పలు మండల కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలను అందజేసి సత్కరించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోట హనుమంతరావు, ఆకుతోట శ్రీనివాసరావు, కోశాధికారి వక్కలగడ్డ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మువ్వల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ హాజరై ప్రసంగించారు. ఆర్యవైశ్య సంఘ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అత్తులూరి సుబ్బారావు, తూనుగుంట్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





ఉష్ణోగ్రత (అంచనా)

26-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	28
తెనాలి	34	28
నరసరావుపేట	34	26
బాపట్ల	34	27
రెంటచింతల	35	26
చీరాల	34	27

పన్నుల ఆదాయం పెరగాలి

- మరో 20 శాతం పెరగాలని ఆదేశాలు
- ప్రజలపై భారం వేయకుండా రాబట్టాలని సూచన
- ఆస్తి పన్ను పునఃపరిశీలనకు ఇంటింటి సర్వేకు అధికారులు సిద్ధం
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రూ.52 కోట్లు పెరగాలని టార్గెట్

మున్సిపాల్టీలకు ప్రభుత్వం లక్ష్యం



పురపాలక సంఘాలు పన్నుల ఆదాయం పెంచుకోవాలి. స్వయం సమృద్ధి సాధించాలి. ఇప్పుడు ఉన్న పన్నుల ఆదాయం మరో 20 శాతం వరకు పెరగాల్సిందే. ఇందుకు అవసరమైన మార్గాలను అన్వేషించండి.. అని ప్రభుత్వం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రజలపై భారం వేయకుండా ఆదాయాన్ని రాబట్టా లని నిర్దేశించింది. దీంతో ఆస్తి పన్ను పునఃపరిశీలనకు ఇంటింటి సర్వేకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక బృందాలతో సిద్ధమ య్యారు. అయితే గతంలో పన్నుల మదింపులో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. వాటిని గుర్తించి పన్నులను సరి చేస్తే మున్సి పాల్టీలకు ఇబ్బడిమబ్బడిగా ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదం టే గతంలో మాదిరిగా అక్రమాలకు, ఒత్తిళ్లకు లోనవు తారో చూడాలి. మొత్తంమ్మీద గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీల ఆదాయం రూ.52 కోట్లు వరకు పెరగనున్నది.

లక్ష్యం ఇలా..

- గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్ సహా మున్సిపాల్టీలో ఆస్తి పన్ను వార్షిక ఆదాయం రూ.185.31 కోట్లు ఉంది. దీనిపై మరో 20 శాతం ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు రూ.37.06 కోట్లు ఆదాయం పెరిగే అవకాశం ఉంది.
- పల్నాడు జిల్లాలో ఆస్తి పన్ను ఆదాయం రూ.47.01 కోట్లు కాగా మరో రూ.9.40 కోట్లు పెంచుకోవాలి.
- బాపట్ల జిల్లాలో 26.63 కోట్లు ఉండగా 5.32 కోట్లు పెరగాలి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీలు స్వయంగా ఆర్థిక ప్రతిపత్తిని సాధించాలని ప్రభుత్వం నిర్దేశించింది. నిధుల కోసం ప్రభుత్వం వైపు చూడకుండా ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించింది. ఈ క్రమంలో ఇక ప్రతి మున్సిపాల్టీ ప్రస్తుతం ఉన్న ఆస్తి పన్ను ఆదాయాన్ని 20 శాతం పెంచుకోవాల్సిందే. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను ద్వారా వార్షిక ఆదాయం రూ.258.95 కోట్లు ఉంది. ఈ మొత్తంపై 20 శాతం ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఈ మేరకు రూ.51.79 కోట్లు ఆదాయం పెరగాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో పురపాలకులు ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ఆస్తి పన్నుకు సంబంధించి సమగ్ర పరిశీలన చేస్తున్నారు.

గతంలో అనేక అక్రమాలు..

మున్సిపాల్టీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్ను. పన్ను మదింపులో గతంలో మున్సిపాల్టీల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. పన్ను వసూళ్లకు గత టీడీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. భవనం, ఖాళీ స్థలం కొలతలు ఆన్‌లైన్‌లో పొందు పరిస్తే పన్ను ఎంతో తెలుస్తుంది. ఆన్‌లైన్ విధానం వల్ల అక్రమాలు జరగవని భావించింది. అయితే కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తప్పుడు కొలతలు నమోదు చేయడంతో పన్ను తక్కువగా నమోదైందని ప్రభుత్వం నిర్ధారించింది. ఇలాంటి అక్రమాలపై దృష్టి సారించాలని పురపాలకులను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. దీంతో ఆస్తి పన్ను లోపాలను గుర్తించేందుకు మున్సిపాల్టీల్లో కసరత్తు జరుగుతోంది. అలాగే ఇంటి కోసం నిర్మించిన భవనాన్ని వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పన్ను విధించిన సమయంలో ఒక అంతస్తు ఉన్న భవనంపై ఆ తర్వాత కట్టడాలు వంటివి చోటు చేసుకున్నాయి. వీటన్నింటిపై మున్సిపాల్టీలు దృష్టి సారించాయి. ఇందుకోసం మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక బృందాలను నియమించాయి. పట్టణాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి పన్ను విధింపులో చోటు చేసుకున్న లోపాలను గుర్తించి, వాటిని సరిచేసి ఆదాయాన్ని పెంచుకునే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. అన్‌అసైన్డ్, అండర్ అసైన్డ్ భవనాలను గుర్తిస్తున్నారు. ఇంటింటి సర్వేను వచ్చే నెల 15 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో సర్వేకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లు రోజు వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆక్సిజ..నై

నాలుగేళ్ల క్రితం ప్రపంచాన్ని కరోనా వణికించింది. అలాంటి కరోనా కేసులు ఆనవాళ్లు ప్రస్తుతం మళ్లీ రాష్ట్రంలో అక్కడక్కడ వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. అయితే వైరస్ వ్యాప్తి చెందితే చికిత్సలకు ఆస్పత్రుల్లో సౌకర్యాలు ఉన్నాయా అంటే గుంటూరు, బాపట్ల, పల్నాడులోని పలు ఏరియా ఆస్పత్రుల్లో అనుమానమే. గతంలో కరోనా సమయంలో ఎక్కువ మంది ఆక్సిజన్ అందకే మరణించారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఆక్సిజన్ ప్లాంట్లు ఏరియా ఆస్పత్రుల్లో ఉన్నాయా అంటే.. పేరుకు మాత్రమే ఉన్నాయి. మరమ్మతులు, నిర్వహణ లేక మూలనపడి ఉన్నాయి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో అత్యవసరంగా ఉపయోగపడే ఆక్సిజన్ ప్లాంట్లను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- ఆస్పత్రుల్లో ప్లాంట్లు అలంకారప్రాయం
- మరమ్మతులు నోచుకోక ఏళ్లుగా నిరుపయోగం
- టెక్నీషియన్ల కొరతతో కొరవడిన ప్లాంట్ల నిర్వహణ
- ఏరియా వైద్యశాలల్లో ప్రైవేటు ఆక్సిజన్‌కే పెద్దపీట
- వెలుగుచూస్తోన్న కరోనా..
- ప్లాంట్లు సిద్ధమయ్యేనా?
- గతంలో ఆక్సిజన్ అందకే పెద్దసంఖ్యలో మరణాలు



బాపట్ల ఏరియా ఆసుపత్రిలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

(బాపట్ల, చీరాల, రేపల్లె, నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గతంలో కరోనా సమయంలో అప్పటి అవసరాల కోసం రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్లు అలంకారప్రాయంగా మారాయి. పలు ఆస్పత్రుల్లో రెండు నుంచి మూడేళ్లగా నిర్వహణ, మరమ్మతులు లేక ఆక్సిజన్ ప్లాంట్లు మూలనపడ్డాయి. స్వల్ప మరమ్మతులతో వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నా వైద్య ఆరోగ్య శాఖ కనీస చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కానరావడంలేదు. కరోనా సమయంలో గత ప్రభుత్వం రూ.కోటి చొప్పున వెచ్చించి ప్లాంట్లను ఏర్పాటు చేసింది. అయితే ఆ నిధుల వినియోగంలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు అప్పట్లో పెద్దఎత్తున వచ్చాయి. ప్రారంభించిన రెండేళ్లకు వాటి నిర్వహణను విస్మరించడంతో ఇవి ప్రస్తుతం పనికిరాకుండా పోయాయి. దీంతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు అత్యవసర సమయాల్లో ఆక్సిజన్ అందించలేకపోతున్నారు. అత్యవసర చికిత్సల సమయంలో 10 శాతం మంది రోగులకి ఆక్సిజన్ అవసరం పడుతున్నా అధికారులకు పట్టడంలేదు. ఈ పరిస్థితుల్లో కొన్ని ఆస్పత్రుల్లో రోగులు ఆక్సిజన్ కోసం ప్రైవేటు ఏజెన్సీల వైపే చూస్తున్నారు. ఈ ఆక్సిజన్ సిలిండర్ల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుందని రోగుల కుటుంబ సభ్యులు వాపోతున్నారు. అనేక ఆస్పత్రుల్లో మరమ్మతులతో పాటు ప్లాంట్ల టెక్నీషియన్ల కొరత కూడా ఉంది. ఇక జనరేటర్, ఇతర పరికరాల సంగతి అయితే చెప్ప క్కర్లేదు. అవి దాదాపుగా పనికిరాని స్థితిలోనే ఉన్నాయి.



రేపల్లె : ప్రభుత్వ వైద్యశాలలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

ఆదుకుంటోన్న కాన్సంట్రేటర్లు

ఆక్సిజన్ ప్లాంట్లు నిరుపయోగంగా మారడంతో పలు ఏరియా ఆస్పత్రుల్లో రోగుల అవసరాలు తీర్చేందుకు కాన్సంట్రేటర్లే దిక్కు వుతున్నాయి. ఒక్కోదానిలో ఐదు లీటర్ల కెపాసిటీ మాత్రమే ఉంటుంది. అత్యవసర వైద్య సేవల సమయంలో ఇది సరిపోక అనేకఅవస్థలు పడాల్సి వస్తోంది.

బాపట్ల జిల్లాలోని బా పట్ల, చీరాల, రేపల్లెలోని ఏరియా ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. బాపట్లలోని ప్లాంట్ మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉంది. చీరాలలో మరమ్మతులతో పాటు సిబ్బంది కొరత కూడా నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో దాతల సహ కారంతో రేపల్లెలో నిర్మించిన ప్లాంటుకు సంబంధించి విడి పరికరాలు పని చేయడం లేదు. కంప్రెషర్ సమస్య ఉంది. సంవత్సరం నుంచి ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది.

నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ నెలల తరబడి పనిచేయడం లే దు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టే నాటికే ప్లాంట్ పనిచే యడంలేదని చెప్పారు.



చీరాల ప్రాంతీయ వైద్యశాలలో ప్రాణవాయువు ట్యాంకు

వీడని..
అకాల వర్షాలు

- పలు ప్రాంతాల్లో ముంచెత్తిన వాన
- పంట ఉత్పత్తులు, పచ్చి ఇటుకలకు నష్టం
- గాలులు, ఉరుములతో విద్యుత్ అంతరాయం



పెసర్లంక వద్ద వర్షానికి తడిచిన మొక్కజొన్న కండెలు



వర్షానికి తడిచిన పచ్చి ఇటుకలు

బాపట్ల, భట్టిప్రోలు, కొల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉరుములు.. మెరుపులు.. ఈదురుగాలులతో భారీ వర్షాలు. రోహిణి కార్తెలో విపరీతంగా మారిన వాతావరణ పరిస్థితుల్లో అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురిసింది. 25 మండలాల్లో 731 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. దీంతో మొక్కజొన్న పంట ఉత్పత్తులు, పచ్చి ఇటుకలు తడిచి నష్టం వాటిల్లింది. ఉరుములు, మెరుపులు, పిడుగుల కారణంగా 33 కేవీ లైన్ ఇన్సూలేటర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కొల్లూరు మండలంలోని దోనేపూడి, జువ్వలపాలెం సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో శనివారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భట్టిప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా లేదు. దోనేపూడిలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయం వద్ద భారీ వృక్షం నేలవాలడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

రేపల్లెలో అత్యధికం..

అత్యధికంగా రేపల్లెలో 70.23 మిల్లీమీటర్లు, అతిస్వల్పంగా సంతమాగులూరులో 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చుండూరులో 21.2, అమర్తలూరులో 16.4, వేమూరులో 18.4, కొల్లూరులో 25.8, భట్టిప్రోలు 40, చెరుకుపల్లిలో 46.2, పిట్టలవానిపాలెంలో 28.4, కర్లపాలెంలో 54.4, బాపట్లలో 46.8, నిజాంపట్నంలో 23.4, నగరంలో 46, బల్లికురవలో 14.4, మార్టూరులో 25.8, యద్దనపూడిలో 28.4, పర్చూరులో 25.4, కారంచేడులో 39.2, ఇంకొల్లులో 15.2, జె.పంగులూరులో 7.4, అద్దంకిలో 45.6, కొరిశపాడులో 12.8, చీరాలలో 26.6, వేటపాలెంలో 40.2, చినగంజాంలో 9.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ వెంకటమురళి

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో సోమవారం నుంచి గురువారం కోస్తాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ వెంకటమురళి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్ష ప్రభావంతో తీరప్రాంతాల్లో 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.

రహదారుణాలకు సంపూర్ణ పరిష్కారం

- మూడు జిల్లాల్లో 16 రోడ్లకు మరమ్మతులు
- రూ.44.3 కోట్లు కేటాయించిన ఆర్‌అండ్‌బీ శాఖ
- కిందటేడాది నవంబరులోనే బాగుపడిన రోడ్లు
- అప్పట్లో రూ.640 కోట్లతో మరమ్మతులు
- తాజాగా మిగిలిన పనులు..

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రహ'దారుణాలకు' కూటమి పూర్తి పరిష్కారం చూపుతోంది. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల ప్రక్రియ జిల్లాలో వేగంగా కొనసాగుతోంది. తొలి విడతగా కిందటేడాది అక్టోబరులో మూడు జిల్లాల్లో ప్యాచ్ వర్కులు, తక్షణ మరమ్మతుల కోసం రూ. 35 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఆ వెను వెంటనే మరమ్మతుల కోసం గుంటూరు జిల్లాకు రూ.559.8 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.72 కోట్లు, పల్నాడు జిల్లాకు రూ.4.86 కోట్లు కేటాయించింది. దీంతో జిల్లాలో రోడ్ల పరిస్థితి చాలా వరకూ మెరుగు పడింది. అయితే ఇప్పటికీ పలు రోడ్ల పరిస్థితి సమస్యాత్మకంగా ఉంది. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మరోమారు రహదారుల మరమ్మతులపై దృష్టి సారించింది. మూడు జిల్లాల్లో 16 రహదారుల మరమ్మతుల నిమిత్తం రూ.44.3 కోట్లు మంజూరు చేసింది. ఏడు రాష్ట్ర రహదారులకు రూ.26.9 కోట్లు, ఏడు మేజర్ జిల్లా రహదారులకు రూ. 17.4 కోట్లు కేటాయించింది.

రాష్ట్ర రహదారులకు రూ.26.9 కోట్లు

గుంటూరు జల్లాలో.. గుంటూరు- అమరావతి రోడ్డు మరమ్మతులకు రూ.6.5 కోట్లు, తెనాలి- నారాకోడూరు రోడ్డుకు రూ.4 కోట్లు, గుంటూరు- చీరాల రహదారికి రూ. 2 కోట్లు మంజూరు చేసింది. బాపట్ల జిల్లాలో అద్దంకి- సంతమాగులూరు రోడ్డుకు రూ.4 కోట్లు, రేపల్లె- పిట్టలవానిపాలెం రోడ్డుకు రూ.200 కోట్లు, పల్నాడు జిల్లా వినుకొండ- ముప్పరాజువారిపాలెం రోడ్డుకు రూ.కోటి, నకరికల్లు- గురజాల రూ.40 లక్షలు, సత్తెనపల్లి- మాది పాడు రోడ్డుకు రూ.3 కోట్లు మంజూరు చేయడం జరిగింది.



జిల్లా రోడ్లకు రూ. 17.4 కోట్లు

గుంటూరు జిల్లా పొన్నూరు నియోజక వర్గంలోని పెదకాకాని- వెనిగండ్ల రహదారి మరమ్మతులకు రూ. 3.5 కోట్లు, పల్నాడు జిల్లాలోని కోండ్రముట్ల- బండ్లమోటు- దుర్గి రోడ్డుకు రూ.5 కోట్లు, పెదకూరపాడు- బయ్యవరం రోడ్డుకు రూ. 2.05 కోట్లు, నుదురుపాడు- బోయపాలెం రోడ్డుకు రూ.1.4 కోట్లు, బాపట్ల జిల్లాలోని ఐఎం రోడ్డు నుంచి జాతీయ రహదారి అనుసంధానం అభివృద్ధికి రూ.కోటి, బల్లికురవ నుంచి జాతీయ రహదారి అనుసంధానానికి రూ.2.40 కోట్లు, బేతపూడి- రావిఅనంతవరం వయా మోర్లవారిపాలెం, పేటేరు రోడ్డుకు రూ.2.05 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

తీరం తాకిన సంతోషం

1సూర్యలంకలో పర్యాటకుల సందడి
1వేసవి సెలవులు, ఆదివారంతో పోటెత్తిన ప్రజలు

బాపట్ల,మే 25 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవులు, ఆదివారం సంతోషం సూర్యలంక సముద్ర తీరం తాకింది. ప్రముఖ పర్యాటక కేంద్రం పర్యాటకులతో పోటెత్తింది. సముద్ర స్నానాలు.. ఇసుక తిమ్మెర్ల ఆటలతో ఆనందం ఎగసిపడింది. గుర్రాలు, ఒంటెలు, బైక్ రైడ్స్‌తో యువత కేరింతలు కొట్టారు. పర్యాటకులకు అన్ని రకాల వసతులు, ఆహార పదార్థాలు అందుబాటులో ఉండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే సేద తీరారు. వేసవి సెలవులు కావడంతో పర్యాటకులు అధికంగా సూర్యలంక బాటప డుతున్నారు. మెరైన్, రూరల్ పోలీసులు, గజ ఈతగాళ్లతో గస్తీ నిర్వహించారు.



ఆవుల ఆక్రందన

1వర్షాలకు తడుస్తూ, ఎండకు ఎండుతూ
1అద్దంకి గోశాలకు స్థలం కేటాయించాలన్న మంత్రి గొట్టిపాటి ఆదేశాలను పట్టించుకోని రెవెన్యూ అధికారులు

అద్దంకి, మే 25 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని హరిహర గోశాలలో సుమారు 80 ఆవులు ఉన్నాయి. ఇక్కడ నిలువ నీడ లేక ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ ఆవులు ఆక్రందన చేస్తున్నాయి. మూతపడిన ఓ మిల్లు స్థలంలో తాత్కాలికంగా టెంట్లు వేసి గోవులకు ఆశ్రయం కల్పించారు. సుమారు 15 ఏళ్ల క్రితం గొట్టిపాటి రవికుమార్ ఇచ్చిన ఆవు కూడా ఈ గోశాలలో ఉంది. ఈ ఆవు సంతతి ఐదు ఉన్నాయి. ఇలా పలువురు ఇచ్చిన ఆవులే ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో సుమారు 10 ఆవులను దాతలు సహకారంతో వేసిన షెడ్‌కు మార్చారు. మిగిలిన ఆవులు మొత్తం ఎండకు, వానకు ఇబ్బంది పడుతూ చిరిగిన టెంట్‌ల కిందనే ఉంటున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోవుల పరిస్థితి దయనీయంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి గోశాలకు స్థలం కేటాయించాలని కోరారు. స్పందిం చిన మంత్రి ఆదేశాలతో తొలుత స్థలం కేటాయిం పుపై రెవెన్యూ అధికారులు హడావుడి చేశారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోక పోవడంతో సుబ్బారావు పలుమార్లు మంత్రిని కలిసి సమస్య వివ రించారు. మంత్రి చెప్పినప్పుడు మాత్రం హడావుడి చేస్తూ ఆ తర్వాత సమస్యను దాటవేస్తున్నారు.

సరైన వసతులు లేవు



పాతమిల్లు స్థలంలో సరైన వసతులు లేకపోవడంతో ఆవుల అల్లాడుతున్నాయి. మంత్రి రవికుమార్ స్థలం కేటాయింపునకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే షెడ్లు వేసేందుకు దాతలు సిద్ధంగా ఉన్నారు. 9 నెలల నుంచి రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు అదిగో ఇదుగో అంటూ కాలం వెల్లదీస్తున్నారు.

-గోనుగుంట సుబ్బారావు, గోశాల నిర్వాహకుడు



అద్దంకిలోని పాత మిల్ స్థలంలో చినిగిన టెంట్‌లో గోవులు

అవీ..ఇవీ..

దేవరపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

● పిడుగుపాటుకు పొగాకు కొట్టం దగ్ధం

● రూ.12లక్షలకు పైగా ఆస్తినష్టం



ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన బర్లీ పొగాకు

దేవరపల్లి(పర్చూరు), మే 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధి లోని దేవరపల్లిలో శనివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పిడుగుపడి బర్లీ పొగాకు నిల్వఉంచిన కొట్టాలు దగ్ధమయ్యాయి. ఈప్రమాదంలో గ్రామానికి చెందిన తోకల సుబ్బారావు, తోకల శివ నాగేశ్వరరావుతోపాటు, కొల్లా నాగేశ్వరరావు, తోకల పాపారావుకు చెందిన పొగాకు మండెలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి.. దాదాపు రూ.12లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో గ్రామస్థులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పెద్ద ఎత్తున పొగాకు మండెలు ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఎంత ప్రయత్నం చేసిన మంటలు అదుపు కాకపోవడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫోన్‌ద్వారా అధికారులను అప్రమత్తం చేశారు. ఫైర్‌తోపాటు, రెవెన్యూ, పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. చీరాల, చిలకలూరిపేట ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద స్థలాన్ని మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు సందర్శించి రైతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆదివారం రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో రైతుల వివరాలు నమోదు చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠినచర్యలు: సీఐ



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చీరాల, మే 25 (ఆంధ్రజ్యోతి) : పట్ట ణంలో వాహనదారు లు ట్రాఫిక్ నిబంధ నలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు హెచ్చరించారు. ఆది వారం ఎస్సై గొరపాటి రాజ్యలక్ష్మీ, ట్రాఫిక్ ఎస్సై పవన్, సిబ్బంది తో కలిసి పట్టణంలో ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. పలు రహదారుల్లో పర్యటించి దుకాణ దారులకు, వాహన దారులకు హెచ్చరికలు జారీ చేశారు. నిత్యం వాహనాలపై పర్యవేక్షణ ఉంటుందని సూచించారు. ఆటో, ఇతర భారీ వాహనదారులకు పలు సూచనలు చేశారు. సీఐ వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

చీరాల, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఏలూరుకు చెందిన వరుపుల రవి గాయపడ్డారు. గూడూరులో కుమారుడు ఓ కంపెనీలో శిక్షణలో ఉండగా, ఆయన కోసం వెళ్లి తిరిగి కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లో ఏలూరుకు పయనమయ్యాడు. ఈ నేపథ్యంలో చీరాల సమీపంలోకి రాగానే మెట్లు వద్ద కూర్చున్న రవి రాళ్ల గుట్టపై జారిపడ్డాడు. రైల్వే పోలీసులు 108 ద్వారా చీరాల ప్రాంతీయ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అలాగే కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), మే 25 (ఆంధ్రజ్యోతి) : దొంగ బంగారం తక్కువ ధరకు ఇస్తానని మోసగించిన వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కారంచేడు మండలం తిమిడిత పాడుకు చెందిన కిరణ్‌కు చీరాల్లో ఓ బంగారు దుకాణంలో పనిచేస్తున్న ఆకురాతి ఈశ్వర్‌తో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో తక్కువ ధరకు బంగారు ఇప్పిస్తానంటూ ఈపూరుపాలెం దండయ్య కాలనీకు చెందిన రవితేజను ఈశ్వర్ పరిచయం చేశాడు. అయితే అది నమ్మిన కిరణ్ రూ.3.50లక్షలు నగదు తీసుకుని శనివారం రాత్రి దండయ్యకాలనీకి వెళ్లాడు. అక్కడ కొంత బంగారం చూపించగా పరిశీలించుకుంటున్న సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు పోలీసుల్లా రంగప్రవేశం చేశారు. కిరణ్ అక్కడ నుండి పరారయ్యాడు. అయితే మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు ఆదివారం ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), మే 25 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం చోరీ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అందిన వివరాల ప్రకారం ఈపూరుపాలేనికి చెందిన ఉడతా సాయి ఈపూరుపాలెం కూడలిలో శనివారం రాత్రి ద్విచక్రవాహనం పార్కింగ్ చేశాడు. అయితే కొద్దిసేపటికి వచ్చి చూసేసరికి వాహనం లేదు. దీంతో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి

అద్దంకి,మే25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని గోపాలపురానికి చెందిన గోసాల అంజయ్య(70) ఈ నెల 15న ఉదయం బహిర్భూమికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అంజయ్యను 108 వాహనంలో అద్దంకి వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆయన చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఆదివారం సమాచారం అందింది. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

మృతదేహాలను అప్పజెప్పకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం

పౌర హక్కుల సంఘాల నేతలు

చీరాల, మే 25 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు అఖిల భారత ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, అగ్రనేత సజ్జా నాగేశ్వరరావు, విజయలక్ష్మీ, సంగీత, వివేక్ మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పజెప్పకుడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని పౌరహక్కుల సంఘాల నేతలు విమర్శించారు. పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించకపోవడం అప్రజాస్వామికమన్నారు. మృతదేహాల కోసం ఆయా కుటుంబాలు వైద్యశాలల చుట్టూ తిరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో చేనేత జనసమాఖ్య ప్రతినిధి మాచర్ల మోహనరావు, పీడీఎం రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు తదితరులు డిమాండ్ చేశారు.

పర్చూరు - ఇంకొల్లు రోడ్డుకు మహర్దశ

● కొత్త రహదారి ఏర్పాటుకు రూ.23.88 కోట్ల మంజూరు ● ఫలించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి



పర్చూరు-ఇంకొల్లు రహదారి (ఫైల్)

పర్చూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - ఇంకొల్లు (పాతమద్రాసు) రోడ్డుకు గ్రహణం వీడ నుంది. గత వైసీపీ పాలనలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోని ఈ రోడ్డు ప్రమాదభరితంగా మారింది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణాలు సాగించాలంటే ప్రజలు ప్రాణాలు అరిచేతులో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో రోడ్డు దుస్థితి చూసిన ఎమ్మెల్యే సాంబశివరావు స్పందించారు. రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి దృష్టికి సమస్యను పలుమార్లు తీసుకుపోయారు. సమస్య దీంతో ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రోడ్డు నిర్మాణానికి రూ.23.88 కోట్లు మంజూరు చేసింది. పర్చూరు - ఇంకొల్లు కిలోమీటర్లు 0/375 నుండి 19/680 వరకు రోడ్డు విస్తరణతో పాటు రోడ్డును పటిష్టం చేయాలని, వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు కూడా జారీచేసింది. దీంతో ప్రజల రహదారి సమస్యకు పరిష్కారం దొరికినట్లు అయ్యింది. రోడ్డు దుస్థితి చిత్రాలతో పాటు అధికారుల తయారుచేసిన ప్రతిపాదనలను మంత్రి జనార్ధనరెడ్డికి వివరించి నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యే సఫలీకృతమయ్యారు. సమస్యపై స్పందించి నిధులు మంజూరు చేయించడంతో ఎమ్మెల్యే ఏలూరిని పలువురు అభినందిస్తున్నారు.

వైసీపీ హయాంలో నిలిచిన పనులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచాయి. అప్పటి వైసీపీ నేత అక్రమ వ్యవహారంతోనే పనులు నిలిచిపోయాయి అంటూ ఆపార్టీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి బహిరంగంగా గళం వినిపించారు. ఇక వైసీపీ అధిష్ఠానం కూడా రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరిం చింది ఈ క్రమంలోనే పర్చూరు-ఇంకొల్లు ప్రధాన రహదారి కూడా అధ్వానంగా తయారైంది. ఈరోడ్డులో కొద్దిపాటి వర్షం పడినా నలుదిక్కులా రాకపోకలు నిలిచిపోవాల్సిందే అంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

28న రోడ్డు పనులకు శంకుస్థాపన

పర్చూరు - ఇంకొల్లు రహదారి నిర్మాణానికి ఈనెల 28న శంకుస్థాపన చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశించారు. సరైన రహదారి లేక ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఇసుక క్వారీలో వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రాంతీయ వైద్యశాలలో మృతదేహం



మృతిచెందిన వాసు, ఆస్పత్రి వద్ద నిలిపిన ట్రాక్టర్

పందిళ్లపల్లి(చీరాల), మే 25 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లిలోని ఓ అక్రమ ఇసుక క్వారీలో వ్యక్తి అనుమానస్పదంగా మృతిచెందాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.., స్థానిక సంపత్‌నగర్ కాలనీ గోపాల్‌నగర్‌కు చెందిన చెందిన పిగిలి వాసు(45) ట్రాక్టర్‌తో ఇసుకు తోలుతుంటాడు. ఈ క్రమంలో పందిళ్లపల్లిలో అక్రమంగా కొనసాగుతున్న క్వారీకి ఆదివారం మధ్యాహ్నం ట్రాక్టర్‌తోపాటు డ్రైవర్‌గా వెళ్లాడు. అయితే కొద్దిసేపటికే కుటుంబ సభ్యులకు అక్కడి నుంచి ఫోన్ వచ్చింది. వాసు క్వారీలో ట్రాక్టర్ నుంచి జారిపడడంతో ట్రాక్టర్ టైర్ ఆయనపై ఎక్కిందని చెప్పారు. చీరాల ఏరియా హాస్పిటల్‌కు తీసుకు వస్తున్నామని తెలియజేయడంతో కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లారు. విషయం తెలుసుకుని వైద్యశాల వద్దకు కుటుంబ సభ్యులు చేరుకోగానే అక్కడున్న వైద్యులు మాత్రం మృతదేహాన్ని మార్చురీలో ఉన్నట్లు చూపారు. దీంతో మృతిపై వారు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఘటనపై వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మృతిపై పలు అనుమానాలు

వాసు మృతదేహాన్ని చీరాల వరకు తీసుకొచ్చినప్పటికీ, ఎవరూ తీసుకొచ్చారో కూడా తెలియరాలేదు. కేవలం మృతదేహాన్ని అప్పగించి వారు వెళ్లినట్లు తెలిసింది. ఇక అక్కడేమైనా ఘర్షణ జరిగిందా..? అనేది తెలియాల్సి ఉంది. ఘటన జరిగిన వెంటనే ఎవరైన 108కి ఫోన్ చేయడం పరిపాటి ఇక్కడ అలా జరగలేదు. ఇక క్వారీ ఎవరిది..? అక్రమంగా తవ్వకాలు జరుగుతుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తుందన్నది పోలీసు విచారణ తెలియాల్సి ఉంది.

గోతులు పూడ్చిన టీడీపీ నాయకులు

అద్దంకి, మే 25 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో ప్రమాద కరంగా ఉన్న గోతులను టీడీపీ నాయకులు ఆదివారం పూడ్చివేశారు. ఈ సెంటర్‌లో వాహనాల రద్దీతో తరచూ గోతులు పడు తున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతులు మరింత పెద్దవిగా మారి వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అద్దంకి పట్టణ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాకాని అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రావెల్ తోలించి ఎక్స్‌కవేటర్‌తో చదును చేశారు. దీంతో తాత్కాలికంగా సమస్య పరిష్కారమైంది. అయితే మరోసారి పడితే గోతులు పడే అవకాశం ఉన్నందున ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గోతులు శాశ్వతంగా పూడ్చాలని, వర్షం నీరు రోడ్డు పైకి రాకుండా సైడ్ కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.



చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్



భవానీ సెంటర్‌లో గుంతలకు తోలుతున్న గ్రావెల్

బాలబాలికలకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాల పంపిణీ

చినగంజాం, మే 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యం హైస్కూల్‌లో వేసవి ఉచిత శిక్షణ తరగతుల్లో పాల్గొన్న బాలబాలికలకు సోపిరాల వెల్ఫేర్ అసోసియేషన్(సేవా) ఆధ్వర్యంలో ఆదివారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ తరగతి నుండి పదో తరగతి వరకు చదివే బాలబాలికలకు 30 రోజుల నుంచి స్పోకెన్ ఇంగ్లీష్, బేసిక్ గ్రామర్‌లో వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఇంగ్లీష్ భాషా పట్ల ఆసక్తిని, నైపుణ్యాలను శిక్షణ తరగతులలో బాలబాలికలకు పెంపొందించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతుల పట్ల విద్యార్థులు మొక్కువ చూపిస్తూ సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్, బేసిక్ గ్రామర్ పుస్తకాలను సభ్యులు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సోపిరాల ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆమంచి వెంకటేశ్వరరావు, నున్నా హరనాథ్‌బాబు, తుమ్మలపెంట శ్రీనివాసరావు, పర్వతరెడ్డి రంగనాథ్, పి.వెంకటస్వామి, ఉలిచి చంద్రశేఖర్, సిద్దం నాగమల్లేశ్వరరావు, దేశంశెట్టి సురేష్, పల్లపోలు శ్రీమన్నారాయణ, పీ.శ్రీనివాస రావు, శిఖరం వెంకటేశ్వరరావు, పోలకం వెంకయ్య, ఆర్.పోతు రాజు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలతో విద్యార్థులు

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

పందిళ్లపల్లి (చీరాల) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఉపాధ్యాయులు, స్కూల్ కమిటి ప్రతినిధులు కోరారు. ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్కూల్‌కు సంబంధించి దాతలు అందించిన భూములకు హద్దులు వేయించారు. ఈ క్రమంలో ఆ భూములను ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో అనేక మంది ఇసుక దోపిడీ దారులు, ఆక్రమణ దారులు భూములను సొంతం చేసుకోవాలని పన్నాగం పన్నినట్లు చెప్పారు. అయితే వారి నుండి భూమిని కాపాడేందుకు పలు సమస్యలు ఎదుర్కొన్నట్లు వివరించారు. వీలైతే పాఠశాల అభివృద్ధికి సహకరించాలని, ఇలా దోపిడీకి పాల్పడడం అన్యాయమన్నారు. భిన్నంగా వ్యవహరించిన వారిపై ప్రభుత్వ పరమైన చర్యలు తప్పని హెచ్చరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు శేఖర్, ఉపాధ్యాయులు జయకృష్ణ, విద్యాధర్, రామిరెడ్డి, బాలాజీ కుమార్, ఎస్ఎంసీ ఛైర్మన్ చెరుకూరి రాంబాబు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

రిటైర్డ్ మేజర్ రోశయ్య

చీరాల, మే 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా బంగారు భవిష్యత్తును పొందుతారని రిటైర్డ్ ఎన్‌సీసీ మేజర్ రోశయ్య పేర్కొన్నారు. కొద్ది రోజులుగా స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్యతో పాటు ఎన్‌సీసీ శిక్షణ అవసరమని చెప్పారు. ఈ శిక్షణ ద్వారా క్రమ శిక్షణ, దేహదారుఢ్యం సాధించవచ్చన్నారు. అనంతరం క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ ఎన్ఎస్ పరమార్, సుబేదార్ మేజర్ నజీర్ అహ్మద్, అడ్జెస్టమెంట్ మేజర్ రాజు, సుబేదార్ ముఖేష్, అవతార్ సింగ్, రమేష్, హవల్దార్ దీపక్, వీరేష్ తదితరులు రోశయ్యను సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు.



రోశయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

బండ్ల రామారావు స్మారక సాహితీ పురస్కారాలు

చీరాల, మే 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా బండ్ల రామారావు స్మారక సాహితీ పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి మోహన్‌రావు రచించిన వ్యాసరచన పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలువురు కవులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వడలి రాధాకృష్ణమూర్తి, బాగి కృష్ణమూర్తి, నాగవీరభద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.



కవులను సత్కరిస్తున్న ప్రతినిధులు

రామలింగేశ్వరస్వామి ఆలయ ఈవోగా శ్రీనివాసరావు బాధ్యతలు

ఈపూరుపాలెం (చీరాల), మే 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా పి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయగా ఆదివార ఆయన బాధ్యత తీసుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



శ్రీనివాసరావు

అద్దంకి నాంచారమ్మకు ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పర్చూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు గ్రామదేవత అద్దంకి నాంచారమ్మ వారి తిరునాళ్లను పురస్కరించుకొని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఈ నెల 27న తిరునాళ్ల వేడుకలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు అమ్మవారిని వివిధ రకాల అలంకరణలో ప్రత్యేక పూజలు చేపడుతున్నట్లు ఆలయ వంశపారంపర్య అర్చకులు, కొల్లా పెద్ద కాపు తెలిపారు. తిరునాళ్ళ మహోత్సవ వేడుకలు ఉత్సవాలను ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు నేతృత్వంలో సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

నాలుగో తరగతిఉద్యోగుల నూతన సంఘం ఎన్నిక

● అధ్యక్ష, కార్యదర్శులుగా సుధీర్, ఏడుకొండలు

అద్దంకిటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం సమావేశం ఆదివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొరిశపాడు సమితి ఎన్నికలు నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.సుధీర్, ఒ.ఏడుకొండలు, గౌరవ అధ్యక్షులుగా పద్మావతి, ఉపాధ్యాక్షుడుగా డి.దేవరాజ్, జాయింట్ సెక్రటరీగా ఆర్.సుప్రజ, ట్రెజరర్‌గా ఎస్.సందీప్, కో-ఆప్షన్ సభ్యుడిగా టి. సంగీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వై.పోలయ్య, అబ్జర్వర్ ఈవీ శివప్రసాద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులుకు ఉద్యోగులు శుభాకంక్షలు తెలియజేశారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం

అద్దంకిటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం శింగరకొండలోని వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. క్రాంతి సైకిల్ ట్రేడర్స్ రంగారావు సౌజన్యంతో ఆయన తండ్రి పాటిబండ్ల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా దాత రంగారావు దంపతులను రోటరీ క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, బాచిన పూర్ణచంద్రరావు, అలహరి హరిప్రసాద్, పసుపులేటి ఆంజనేయులు, సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

● పట్టించుకోని పంచాయతీ అధికారులు



మేదరమెట్లలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

మేదరమెట్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలోని ప్రధాన రహదారులపై మురుగు ప్రవహిస్తోంది. మురుగు కాలువలు నిర్మించకపోవడంతో మట్టి కాలువలల్లో మురుగు ముందుగు సాగడం లేదు. ఎక్కడికక్కడే మురుగు నిలిచిపోతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు ప్రబలుతున్నాయి. మురుగు రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డుపై ప్రయాణించే ప్రజలు, సమీప గృహాల ప్రజలు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు.. మేజర్ పంచాయతీ అయిన మేదరమెట్లలో సైడ్ కాలువలు నిర్మించకపోవడం ప్రజల నుంచి విమర్శలకు తావిస్తోంది. మేదరమెట్లలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన మిద్దెలడొంక రోడ్డులో సైడ్‌కాలువలు లేక, మురుగుపారక అవస్థలు పడుతున్న ప్రజలు, పంచాయతీ అధికారులపై, పంచాయతీ పాలకవర్గంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం - పొంచి ఉన్న ప్రమాదం

పంగులూరు, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనకవరం, కొండమూరు గ్రామాల మధ్య విద్యుత్ స్తంభం పూర్తిగా పక్కకు ఒరిగి ప్రమాదభరితంగా మారింది. పంగులూరు నుంచి జనకవరం వైపుగా కొండమూరు వరకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం నూతనంగా విద్యుత్ లైన్ నిర్మించారు. నిర్మాణ పనులు సరిగా లేకపోవడంతో విద్యుత్ స్తంభం నేలకు ఒరిగిందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని, విద్యుత్ స్తంభాలకు సపోర్ట్ తీగలు వేసి ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చెట్టుపై ఒరిగిన స్తంభం

చిల్లచెట్లతో మూసుకుపోయిన డొంక

పంగులూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలవలపాడు రెవెన్యూ పరిధిలో పేరయ్య కుంట నుంచి ఉత్తరం వైపు పంట పొలాలకు వెళ్లే డొంక చిల్లచెట్లతో మూసుకు పోయి ఛీద్రమైంది. పెద్ద పెద్ద గోతులు కూడా పడడంతో వాహనాల రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉంది. ఈ డొంకకు ఇరువైపులా అలవలపాడు, తూర్పు తక్కెళ్లపాడు, జనకవరం గ్రామాల రైతులకు చెందిన షుమారు నాలుగు వందల ఎకరాల పంట పొలాలున్నాయి. రైతుల ప్రయోజనం కోసం రెండున్నర దశాబ్దాల క్రితం గ్రావెల్‌తో రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం డొంక మూసుపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రహదారులకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



మూసుకుపోయిన డొంకదారి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు **నెల్లూరు** జిల్లా వార్తలు

సోమవారం 26 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.1	29.3
కావలి	36	28
ఆత్మకూరు	36	26
ఉదయగిరి	35	27
కందుకూరు	34	28

అంగరంగ వైభవంగా

కామాక్షితాయి రథోత్సవం

- హరనామ స్మరణతో మారుమోగిన జొన్నవాడ
- తేరు ఎదుట టెంకాయలు కొట్టి, హారతులిచ్చిన భక్తులు
- బ్రహ్మోత్సవాల్లో నేడు కల్యాణోత్సవం





జొన్నవాడ వీధుల్లో సాగుతున్న కామాక్షితాయి రథోత్సవం, (అంతర్‌చిత్రంలో) రథంలో కొలువుదీరిన గంగ, కామాక్షి సమేత మల్లికార్జునస్వామి

బుచ్చిరెడ్డిపాళెం,మే25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గంగ, కామాక్షి సమేత మల్లికార్జునస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తేరుపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చగా, పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉత్సవవిగ్రహాలను మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై ఆశీనులు చేశారు. అనంతరం రథోత్సవం ఆద్యంతం భక్తుల హరనామ స్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా భక్తులంతా రథం ముందు టెంకాయలు కొట్టి, హారతులు పట్టారు. ఈ సందర్భంగా పలువురు రథంపై మిరియాలు, ఉప్పు చల్లారు. ముందుగా స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచు రథం తిరిగే వీధులను శుభ్రం చేయించి, ట్యాంకర్‌తో నీళ్లు చల్లించారు.

● మజ్జిగ, మంచినీరు పంపిణీ

పలు సామాజిక వర్గాలవారు, స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులు రథం లాగిన భక్తులకు మంచినీళ్లు, మజ్జిగ, పానకం, ఇతర శీతల పానీయాలను ఉచితంగా పంపిణీ చేశారు. దాతల సహకారంతో పులిహోర, దద్దోజనం, ప్రసాదాలు అందచేశారు. జొన్నవాడకు వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. రాత్రికి స్వామి,అమ్మవార్లు గజ, సింహ వాహనాలపై వేర్వేరుగా జొన్నవాడ ఆలయం నుంచి పెనుబల్లికి ఊరేగింపుగా వెళ్లారు. సోమవారం ఉదయం అక్కడి నుంచి ఆడపడుచు లాంఛనాలతో తిరిగి ఆలయానికి చేరుకోను న్నారు. కాగా స్వామి,అమ్మ వార్లకు సోమవారం కల్యాణోత్సవం నిర్వహించను న్నారు. ఈ కార్యక్రమా నికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకోసం అన్నీ వసతులతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సేవా కమిటీ చైర్మన్ టీ. అశోకొరెడ్డి, ఆలయ ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి తెలిపారు.



తేరు ముందు టెంకాయలు కొట్టి హారతులిస్తున్న భక్తులు

నేటి నుంచి ఎంఆర్ టీకాలు

- తట్టు, పొంగు వ్యాధుల నివారణే ధ్యేయంగా..
- వ్యాక్సిన్ వేయించుకోని ఐదేళ్లలోపువారే లక్ష్యం
- మూడు రౌండ్లలో 100 శాతం లక్ష్యసాధన
- ఇప్పటికే జిల్లాలో ఐదు తట్టు కేసుల గుర్తింపు



నెల్లూరు (వైద్యం) మే 25 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక టీకాల వల్ల ఎలాంటి ప్రాణాంతక వ్యాధులు రాకూడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా ఆయా టీకాలు వేయాలని ఆదేశించింది. అయితే 2024లో 18 తట్టు(మీజుల్స్) కేసులు నమోదు కాగా, 2025 ఇప్పటి వరకు ఐదు తట్టు కేసులు నమోదయ్యాయి. ఈ సమస్య ఎక్కువగా సంచార జాతుల కుటుంబాల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరి కుటుంబాల్లోని చిన్నారులకు ఎంఆర్ (మీజుల్స్, రూబెల్లా) టీకా వేయాలని నిర్ణయించింది.

● నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్

ఈనెల 26 (సోమవారం) నుంచి జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఈనెల 31 వరకు కొనసాగిస్తారు. రెండో రౌండ్‌లో జూన్ 23 నుంచి 28 వరకు ప్రత్యేక శిబిరాల ద్వారా ఎంఆర్ టీకాలు వేస్తారు. మూడో రౌండ్‌లో జూలై 21 నుంచి 26 వరకు ఈ టీకాలు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కాగా ఈనెల 18 నుంచి 23 వరకు వైద్య ఆరోగ్యశాఖలోని వ్యాధినిరోధక టీకాల విభాగం వారు ప్రత్యేక సర్వే నిర్వహించి, 226 సమస్యాత్మక ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, ఇటుక బట్టీలు, రొయ్యల గుంటలు, మురికి వాడలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఈ టీకాలు వేయాలని నిర్ణయించారు.. పట్టణ ప్రాంతాల్లో 96 మంది, గ్రామీణ ప్రాంతాల్లో 64 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

100 శాతం ఎంఆర్ టీకాలు పూర్తిచేస్తాం



జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులకు ఎంఆర్ టీకాను 100 శాతం వేసేలా చర్యలు తీసుకుంటు న్నాం. టీకాలు వేయించుకోని చిన్నారులను ఇప్ప టికే గుర్తించాం. వారందరికి టీకాలు వేస్తాం.

- డాక్టర్ ఉమామహేశ్వరి, వ్యాధి నిరోధక టీకాల అధికారి

● ఐదేళ్లలోపువారు 1.72 లక్షలమంది

జిల్లావ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులు 1.72 లక్షల మంది ఉన్నారు. వీరిలో ఎంతమంది ఎంఆర్ టీకాలు వేయించుకున్నారో తెలియదు. వైద్య ఆరోగ్యశాఖ టీకాల విభాగం మాత్రం 97 శాతం టీకాలు పూర్తి చేశామని చెబుతోంది. అయితే గిరిజన ప్రాంతాలు, రొయ్యలగుంటలు, సంచార కుటుంబాలలో టీకాల వేయించుకోని వారిశాతం ఎక్కువగా ఉంది. ఈ లెక్కన పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తే మరింత మందిని గుర్తించే అవకాశం ఉంది.

రైతులకే పనులు

- ఇరిగేషన్ వర్క్స్ అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం
- రూ.10 లక్షల వరకు సాగునీటి సంఘాలకే...
- టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలోనే...
- కాలువల నిర్వహణలో బాధ్యత పెంచేందుకే..



నెల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఏ కాలువను బాగు చేస్తున్నారో.. ఏ కాలువను బాగు చేసినట్లు చూపించి, బిల్లులు పెట్టుకున్నారో...? రైతులకు తెలిసేది కాదు. వైసీపీ నేతలు బినామీలను పెట్టుకొని, కాలువల నిర్వ హణ పనులు చేయకుండానే చేసిన ట్లుగా చూపించి రూ.కోట్లు స్వాహా చేశారు. నాడు మరొకరిని టెండర్ వేయనీయకుండా ఒక్కో నియో జకవర్గంలో ఒక్కరికే గంపగుత్తగా పనులు కట్టబెట్టారు. ఆఖరుకు చిన్న చిన్న పనులను కూడా ప్యాకేజీలుగా మార్చి దోచిపెట్టారు.

● సాగునీటి సంఘాలకే పనులు

అయితే గత ప్రభుత్వ అక్రమాలను గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం.. ఇకపై అలాంటి వాటికి ఆస్కారం లేకుండా పకడ్బందీ నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఇటీవల సాగునీటి సంఘాలకు ఎన్నికలు పూర్తి చేసింది. ఇప్పుడు కాలువల నిర్వహణ పనులను కూడా ఆ సంఘాలకే అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ సాగునీటి సంఘాలు తమ పరిధిలోని రూ. 5 లక్షల్లోపు ఉన్న చిన్నచిన్న మెయింటెనెన్స్ పనులను మాత్రమే నామినేషన్ పద్ధతిలో చేస్తుండేవారు. ఇకపై ఆ పరిధిని రూ.10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాలువల మెయింటెన్స్ పనులు దాదాపుగా రూ.10 లక్షల్లోపే ఉంటాయి. దీంతో ఇకపై కాలువల నిర్వహణ మొత్తం సాగునీటి సంఘాల చేతుల్లోకి రానుంది.

● త్వరగా పనులకు అవకాశం

ఏటా రెండు సీజన్లలోనూ కాలువల్లో ఓఅండ్ఎం పనులు చేస్తుంటారు. కాలువల్లో పూడికతీయడం మొదలు షట్టర్లకు మరమ్మతులు చేయడం వరకు చేస్తుంటారు. వీటిలో సింహభాగం పనులు రూ.5 లక్షల పైనే ఉంటుండడంతో ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలుస్తున్నారు. అయితే ప్రక్రియ జరగడానికి నెల సమయం పడుతోంది. టెండర్లు పిలవడం, వాటిని ఓపెన్ చేయడం, కాంట్రాక్టర్‌తో అగ్రిమెంటు చేయడం, ఆ తర్వాత కాంట్రాక్టర్‌తో పనులు మొదలు పెట్టించడం.. వంటి ప్రక్రియలు ఉన్నాయి. అయితే కొంతమంది కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు. దీనిపై రైతు సంఘాల నేతలు అధికారులకు ఫిర్యాదులు చేసేవారు. అయితే ఇప్పుడు రూ. 10 లక్షల్లోపు పనులన్నీ సాగునీటి సంఘాల పరిధిలోకి రావడంతో పనులు త్వరగా జరిగే అవకాశం ఉంది. కాలువల్లో పూడికతీత, కాలువ గట్లకు మరమ్మతులు, రివిట్‌మెంట్ చేయడం, షట్టర్లకు మరమ్మతులు చేయడం, గేట్లకు రంగులు వేయడం, అత్యవసరంగా చేయాల్సిన పనులు, ఇన్స్‌పెక్షన్ పాత్‌లను మెయింటెన్ చేయడం వంటి పనులన్నీ సాగునీటి సంఘాల పరిధిలోకి వచ్చాయి.

● అంతా రైతులే...

ప్రస్తుతం జిల్లాలో 486 సాగునీటి సంఘాలు(డబ్ల్యూఏ) ఉండగా వాటిల్లో 3649 మంది టెరిటోరియల్ కాన్స్‌స్టియన్సీ (టీసీ) సభ్యులుగా ఉన్నారు. అలానే మరో 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఐదు ప్రాజెక్టు కమిటీలు కూడా ఉన్నాయి. ఈ కమిటీల్లో ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు, సభ్యులంతా ఆయా పరిధిలోని రైతులే కావడం గమనార్హం. వీరి పరిధిలోని కాలువల నిర్వహణకు ఏ పని మంజూరైనా ఈ సభ్యులందరికీ తెలుస్తుంది. కాబట్టి కచ్చితంగా నాణ్యతగా పనులు జరుగుతాయని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. తద్వారా సాగునీటి సంఘాలపై బాధ్యత పెంచడమే కాకుండా కాలువల మెయింటెనెన్స్ కూడా సమర్థవంతంగా జరుగుతుందని వారంటున్నారు.

ఎడగారులో 'ఎంటీయూ'కి

యమా గిరాకీ

- వెతుక్కుంటూ వచ్చి కొనుగోళ్లు
- రబీ అనుభవంతో పెరిగిన సాగు విస్తీర్ణం
- బొరుగులు, అటుకుల తయారీకి ఈ రకం ఎగుమతి
- పూర్వవైభవం వచ్చిందంటున్నరైతులు

నెల్లూరు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎంటీయూ 1010 రకం ధాన్యం ఒకప్పుడు ఎడగారు సాగులో తొలి ప్రాధాన్యత కలిగిన రకం. కాలక్రమేణా పోటీ వరి వంగడాలు వచ్చేసరికి దీన్ని రైతులు పూర్తిగా మర్చిపోయారు. ఇటీవల ఈరకం ధాన్యం బొరుగులు, అటుకుల తయారీలో బాగా గుర్తింపు తెచ్చుకుంది. దీంతో వ్యాపారులు ఈ రకం సాగుచేసిన ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. గత రబీలో పొదలకూరు మండలం తాటిపర్తిలో ఓ రైతు 15 ఎకరాల వరకు ఎంటీయూ రకం సాగు చేశారు. కోతల సమయంలో వ్యాపారులు పోటీపడి మరీ కొనుగోళ్లు చేశారు. ఈ రకానికి ప్రాధాన్యం పెరగడంతో తాజాగా ఎడగారులో తొలి,మలి ప్రాధాన్యం ఉన్న ఈరకం వంగడం రెండో స్థానానికి చేరుకుంది.

● మళ్లీ తెరపైకి..

ఎడగారులో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు అప్పట్లో వ్యవసాయ శాస్త్రవేతలు ఎంటీయూ 1010 (లావులు) రకాన్ని రూపొందించారు. దీన్ని ఎడగారులో తొలి ప్రాధాన్యతా క్రమంలో రైతులు సాగు చేసుకుంటూ వచ్చారు. బీపీటీ, ఎస్ఎల్ఆర్, తాజాగా కేఎన్ఎంలు పోటీ వరి వంగడాలుగా మారడంతో ఎంటీయూ రకానికి గిరాకీ తగ్గింది. ఈ క్రమంలో ఎడగారులోనూ సాగుచేసేవారు లేకుండాపోయారు. దాదాపుగా ఈ వంగడాన్ని రైతులు మర్చిపోతున్నార నుకునే సమయానికి మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటు సాగులో చీడపీడలను తట్టుకునే శక్తి దీనికి ఉండటం, బొరుగులు, అటుకల తయారీకి ఈ రకం ప్రత్యేకమైనదని కావడంతో వ్యాపారులు పండిన ధాన్యాన్ని పండినట్లుగా కొనుగోలు చేస్తున్నారు. రబీలో ఈ రకాన్ని అక్కడక్కడా అతి తక్కువమందే సాగు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన వ్యాపారులు వరికోతల వద్దకు వచ్చి మంచి ధర చెల్లించి తీసుకెళ్లారు. దీంతో తాజాగా ఎడగారులో కేఎన్ఎం రకాన్ని తొలి ప్రాధాన్యంలో సాగు చేసినా, రెండో ప్రాధాన్యంలో ఎంటీయూ రకాన్ని సాగులోకి తీసుకు వస్తున్నారు. నెల్లూరుకు పడమరన ఉన్న గ్రామాల్లో ఈ వంగడాన్ని ఎక్కువమంది సాగు చేసేందుకు నార్లుపోశారు. అక్కడక్కడా నాట్లు కూడా కూడా వేస్తున్నారు.



పరినాట్లు వేస్తున్న కూలీలు

● పెరగిన డిమాండ్

రబీలో ఎంటీయూ రకాన్ని తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు పుట్టి రూ. 20 వేల వరకు అమ్మారు. అంతకుముందు పుట్టి రూ. 16 వేలకు కొనుగోలు చేస్తే గొప్ప. కానీ తాజాగా ఎడగారు సీజన్‌లో ఒక్కసారిగా ఈ రకానికి గిరాకీ పెరగడంతో నెల్లూరు రూరల్లోని పూర్తి విస్తీర్ణంలో రెండో ప్రాధాన్యపంటగా ఈ రకాన్ని సాగు చేస్తున్నారు. రబీలో వచ్చే ధర కంటే అదనపు ధర దక్కుతుందని రైతులు ఆశిస్తున్నారు. వ్యాపారులే గ్రామాలకు వచ్చి నేరుగా కొనుగోలు చేస్తుండటంతో ఎంటీయూ 1010 రకానికి పూర్వ వైభవం వచ్చినట్లుగా రైతులు చెప్పుకుంటున్నారు.

'ఉపాధి' ఉద్యోగుల ఎదురుచూపులు

పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే..

ఉద్యోగోన్నతులు ఎప్పుడో..?

సంగం, (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఏళ్ల తరబడి ఉద్యోగోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వీరిని ఏమాత్రం పట్టించుకోలేదు. పదోన్నతులతో పాటు పీఆర్‌సీని కూడా పక్కనపెట్టింది. ఈ నేపథ్యంలో వారు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

గత పాలకుల కాలయాపన

ఉపాధి హామీ పథకంలో డ్వామా ఉద్యోగులు 19 నుంచి 23 ఏళ్లుగా పనిచేస్తున్నారు. గత వైసీపీ ప్రభు త్వం పీఆర్‌సీ ప్రకారం 23 శాతం జీతాలు పెంచకపోగా, పదోన్నతులు కూడా కల్పించలేదు. వీరితో పాటు చేరినవారికి తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం టైం స్కేల్ అమలు చేసింది. వైసీపీ పాలకులు మాత్రం అదిగో... ఇదిగో.. అంటూ ఐదేళ్లపాటు కాలయాపన చేశారు.

పదోన్నతులకు అర్హులే..

ప్రస్తుతం ఉపాధి పథకంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అత్యున్నత పరిజ్ఞానంతో ప్రజలకు అవగాహన కల్పించడం, అమలు పరచడం, పర్యవేక్షణ చేయడం, పరిపాలనాపరమైన అంశాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధి హామీ ఉద్యోగులు అన్నీ క్యాడర్లలోనూ పదోన్నతులకు అర్హులేనని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తున్నది. కానీ పదోన్నతులకు అవకాశం కల్పించడం లేదు. ప్రతి గ్రామంలోనూ గ్రావెల్, టీటీ, సిమెంట్ రోడ్లు, సచివాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీ శక్తి, రైతు సేవా, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల ప్రహరీగోడల నిర్మాణం, ఇతర మౌలిక వసతులు కల్పించడంలో ఉపాధి హామీ పథకం ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో ఉంది. అలాగే అటవీ, వ్యవసాయ, పంచాయతీరాజ్, విద్య వైద్య, జలవనరులు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ తదితర శాఖల సమన్వయంతో రైతు సంక్షేమ పథకాలు ఉపాధి హామీ పథకం ద్వారానే జరుగుతున్నాయి.

నేటి ప్రభుత్వంపైనే ఆశలు

ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న కూటమి ప్రభుత్వంపైనే వారంతా ఆశలు పెట్టుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను సాంకేతిక సహాయకులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పదోన్నతులు కల్పించాలి. అలాగే సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ ఇంజనీర్లకు ఎంటీసీలకు అదనపు కార్యక్రమ అధికారుల (ఏపీవో)గానూ, హెచ్ఆర్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పించాలని వారు కోరుతున్నారు. అంతేకాక ఫుల్ టైం ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ)కు గ్రామీణాభివృద్ధి శాఖలో 70 శాతం పదోన్నతులు కల్పించాలనే డిమాండ్ ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖలో శ్రీ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఎస్ఆర్‌డీఎస్) కింద పనిచేస్తున్న ఎఫ్‌టీఈల నియామకం తేదీ, తదితర పొరపాట్లను సరిదిద్దాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని వారు కోరుతున్నారు.



సంగంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయం

జిల్లా అంతటా వర్షం



ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో ఉదయగిరి బస్టాండ్‌లో నిలిచిన నీరు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) మే 25 : నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి ఎండకాయగా, రాత్రి పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రానున్న రెండు, మూడు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ ప్రకటించింది. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం రెండో పంట సాగు మొదలయిన తరుణంలో వర్షాలు కురుస్తుండటం రైతాంగానికి కలిసి వచ్చింది. కాగా నెల్లూరు నగరంలో కురిసిన వర్షానికి పలు లోతట్టు ప్రాంతాల్లోనూ, రోడ్లపైన నీరు నిలిచింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 510

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9260
వెండి కిలో ధర	రూ. 1,00,600
వెండి ఒక గ్రాము	రూ.103.60

ఆహిల్యా బాయి హోల్కర్ జయంతి వేడుకలు

బిట్రగుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకానగర్ షిరిడీ శేషసాయి మందిరంలో మందిర వ్యవస్థాపకుడు కే.బ్రహ్మానందం ఆధ్వర్యంలో ప్రాచీన హిందూ దేవాలయాల పునఃనిర్మాణ కర్త ఆహిల్యా బాయి హోల్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరమ్మ, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, సాయిసేవకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలు

కందుకూరు, మే 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు, 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు అవసరమైన ఉపకరణాలకు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సక్షమ్ ప్రతినిధి చన్నా రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80 శాతంకు పైగా వైకల్యం ఉన్నవారికి బ్యాటరీ ట్రైసైకిల్స్, 50 శాతంకు పైగా వైకల్యం ఉన్నవారికి ట్రైసైకిల్స్ ఉచితంగా ఇస్తారని, దీనికి వికలాంగత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోలని తెలిపారు. అలాగే 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు వీల్‌ఛైర్స్, చెవిటి యంత్రాలు, చేతికర్రలను ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను పెద్దబజారులో ఉన్న చన్నాస్ గోల్డ్‌హౌస్‌లో అందజేయాలని, వివరాలకు 9949334606 నెంబరులో సంప్రదించాలని కోరారు.

జేవీవీ కార్యవర్గ సమావేశం

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక రవినర్సింగ్‌హోమ్‌లో జరిగింది. పట్టణంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు, సీనియర్ ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ, ఆర్ట్స్ సబ్జక్ట్‌లలో, నీట్, ఎంసెట్ పోటీ పరీక్షలలో కూడా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ బెజవాడ రవికుమార్, టీ.సబ్బరాయశర్మ, పీ.జానకిరాం, కందికట్టు నారాయణ, శ్రీకర్ల వెంకయ్య, హరినారపరెడ్డి, గాదిరెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): సీఆర్‌డబ్ల్యుడీఎస్ డైరెక్టర్ వైఏ జాకబ్ 7వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కావలిలో ఆ సంస్థ బాధ్యులు గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. కావలి పట్టణ చెరువుకట్ట సంఘం గిరిజన కాలనీలోని గిరిజనులకు చీరలు, పంచలు, ఆహార పొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వై.టోనీ జయకర్, కోఆర్డినేటర్లు వై.సుధీర్, స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన గుర్తింపు కార్డులు...

లింగసముద్రం, మే 25(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, పార్టీ సిద్ధాంతాలు కొనసాగించేలా కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు కోరారు. ఆదివారం లింగసముద్రం పంచాయతీ బలిజపాలెం, జంగంరెడ్డిపాలెం గ్రామాలలో జనసేన గుర్తింపు కార్డులు అందజేశారు.

ప్రమాదకరంగా ఎడమ కాలువ కల్వర్టు

● రక్షణ గోడ లేక వాహనదారుల ఇబ్బందులు



రాళ్లపాడు ఎడమ కాలువపై పడిపోయిన కల్వర్టు రక్షణ గోడ

లింగసముద్రం, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతాహోటల్ నుంచి చీమలపెంట గ్రామానికి వెళ్లే మార్గంలో రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువపై నిర్మించిన కల్వర్టుకు ఓ వైపు రక్షణ గోడ లేక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కల్వర్టు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు మలుపు కూడా ఉండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరీ ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాలలో ఓ మహిళ మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ



వృద్ధ మహిళకు నగదు అందజేస్తున్న డాక్టర్లు

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి) : డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో కావలి వెంగళరావునగర్‌లోని ఆ సమితి కార్యాలయంలో ఆదివారం 60 మంది నిరుపేద వృద్ధులకు రూ.60 వేల విలువ చేసే నిత్యావసరాలు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఊపిరితిత్తుల డాక్టర్ కే. శ్రీనివాసులు మాట్లాడుతూ విశ్వోదయ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) గొప్ప విద్యాదాత, మానవతామూర్తి అని, ఆయన పేరుపై వారి కుమారులు సేవలు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎముకలు, కీళ్ల వ్యాధుల నిపుణులు భానుప్రకాష్, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణురాలు భావన, విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన



యోగా శిక్షణ ఇస్తున్న కోచ్ అరుణరెడ్డి

బిట్రగుంట, మే 25(ఆంధ్రజ్యోతి): 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ఆయూష్ శాఖ వైద్యుడు కొర్రా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. బిట్రగుంట వాకర్స్ వేసవి శిక్షణ శిబిరంలోని తైక్వాండో చిన్నారులకు ప్రముఖ యోగా కోచ్ అరుణరెడ్డి యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం వాకర్స్ అధ్యక్షుడు బీ.బర్నాడ్, చిన్నారులు యోగా కోచ్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు స్వర్ణన్‌రాజ్, మాజీ అధ్యక్షుడు ఎన్ఎస్ యాదవ్, ఫౌండర్ కే.శ్రీనివాసులు, తైక్వాండో కోచ్ రవిగన్, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోగోలుకు తమీమ్ అన్సారీ సైకిల్ యాత్ర

బిట్రగుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): భారతదేశమంతా క్లీన్ సిటీ, గ్రీన్ సిటీలుగా ఉండాలన్న నినాదంతో సైకిల్ యాత్ర చేపట్టిన చెన్నైకి చెందిన తమీమ్ అన్సారీ తిరుగు ప్రయాణంలో ఆదివారం బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చేరారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 6వ తేదీన బెంగళూరు నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించానన్నారు. తిరుపతి మీదుగా తెలుగు రాష్ట్రాలను దాటుకొని దేశరాజధాని ఢిల్లీకి వెళ్లి తిరిగి కోల్‌కత్త మీదుగా నెల్లూరుకు చేరుకున్నానన్నారు. ఇప్పటి వరకు 5,461 కిలో మీటర్లు ప్రయాణం చేశానని, ఇక్కడి నుంచి స్వగ్రామమైన చెన్నైకి చేరుకుని మరో ఐదు రోజుల్లో బెంగళూరు చేరుకుంటానన్నారు.

చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు



మేనేజరును సన్మానిస్తున్న ఖాతాదారులు

కలిగిరి, మే 25 (ఆంధ్ర జ్యోతి): ఖాతాదారులకు చేసిన సేవలే బ్యాంకు ఉద్యోగికి గుర్తింపునిస్తాయని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ సీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజరుగా పనిచేస్తూ సీనియర్ మేనేజర్‌గా పదోన్నతిపై గుంటూరు రీజనల్ ఆఫీసుకు బదిలీపై వెళుతుండగా బ్యాంకు ఆవరణలో ఆదివారం ఖాతాదారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో మేనేజరును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థికి సత్కారం

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో 600కు 593 మార్కులు సాధించి కావలి టౌన్‌ఫస్ట్‌గా నిలిచిన తోట ప్రణీత్‌ను బలిజ-కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఒంటరి మహిళ తోట ఝాన్సీ కుమారుడైన ప్రణీత్‌కు సూరిశెట్టి గోపికిషన్ చేతుల మీదుగా రూ.25 వేలు చెక్కు రూపంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు తోట వెంకటశేషయ్య, నున్నా సచితానందం. నాగిశెట్టి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, అళహరి వెంకయ్య, పీ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి చెక్కు అందచేస్తున్న సంక్షేమ సంఘం బాధ్యులు

అమరా వేదగిరి టీడీపీలో చేరిక

● సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



అమరాకు టీడీపీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, కావలి పట్టణ 33వ వార్డు ఇన్‌చార్జి అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్త ఎట్టకేలకు తన మాతృసంస్థ టీడీపీలో చేరారు. ఆయన ఇటీవల వైసీపీకి, పార్టీ పదవు లకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కావలి పట్టణ 33వ వార్డులోని ఏఎన్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సమక్షంలో వేదగిరి తన అనుచరులతో టీడీపీలో చేరారు. గతంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన వేదగిరి గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని అనివార్యకారణాల వలన వైసీపీలో చేరారు. అప్పటి నుంచి ఆ పార్టీలో కొనసాగిన ఆయన కావలిలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై తన అనుచరులు ప్రోత్సాహంతో తిరిగి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, పోట్లూరు శ్రీనివాసులు, కండ్లగుంట మధుబాబు నాయుడు, తటవర్తి రమేష్, తటవర్తి వాసు, పోతుగంటి శ్రీకాంత్, జ్వాలా సుబ్రహ్మణ్యం, జ్వాలా చంద్ర, బీ. సురేష్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో సమైఖ్యత యాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వైకుంఠపురం ప్రాంతంలో సమైఖ్యత యాత్రను ప్రాంభించింది. యాత్రలో భాగంగా వైకుంఠపురం జెండా చెట్టు, పెంకులఫ్యాక్టరీ రోడ్డు, చెరువు కట్ట సంఘం ప్రాంతాలలో ర్యాలీగా వెళుతూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మంది ప్రాణాలు తీశారన్నారు. వారిలో కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు కూడా చనిపోయారని, ఇది చాలా బాధాకరమన్నారు. అయితే ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ఉగ్రవాదుల దాడిని ఖండించటంలో ప్రజానీకం ఐక్యత, సమైక్యత స్ఫూర్తిదాయకమన్నారు. ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజన తీసుకురావడానికి ప్రయత్నిరచారని, దేశ ప్రజలు సమైక్యంగా ఉండి వారి పథకాన్ని వమ్ము చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం.రమణయ్య, సామేలు, నారాయణ, నాగమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే చోరీల నివారణ : సీఐ



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

కందుకూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రజల అప్రమత్తతతోనే దొంగతనాలను నివారించగలుగుతామని కందుకూరు సీఐ కే.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మదనగోపాలపురంలో ఆదివారం సాయంత్రం ఆయన ప్రజలతో సమావేశం నిర్వహించి సమాజంలోని వివిధ నేరాల అదుపునకు ప్రజల నుంచి అందాల్సిన సహకారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తాళాలువేసి ఉన్న గృహాల్లో దొంగతనాలు జరుగుతున్నందున వాటి నిర్మూలనకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను సూచించారు. మహిళలకు సంబంధించిన నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, సైబర్ నేరగాళ్లబారిన పడి నష్టపోకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

ఆత్మకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. పురప్రముఖులు, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు. బైపాస్ రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమై రవితేజ కల్యాణ మండపం, పాత సినిమాహాలు మీదుగా వైశ్యబజార్, సత్రంసెంటర్, చావిడి సెంటర్, హిల్‌రోడ్, ఎరుకలసాని నగర్, సోమశిల రోడ్డు సెంటర్, ఎల్ఆర్‌పల్లి, పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ డిపో వరకు కొనసాగింది. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సీతారామలక్ష్మణ, హనుమంతుల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి శోభాయాత్ర ప్రారంభించారు. భక్తులు మోటారుబైక్‌లపై శోభాయాత్రలో పాల్గొన్నారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నామస్మరణతో పట్టణం మారుమోగింది. భక్తులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ గావించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో చెంచల వెంకటరమణ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందగా అతని కుటుంబ సభ్యులకు దాత ఆంధ్రా బాలగురవారెడ్డి ఆదివారం రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ముందుగా వెంకటరమణ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, నాయకులు మాలకొండ్రాయుడు, సందిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

యూఈఈయూ నూతన కమిటీ ఎన్నిక

ఆత్మకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారకవనంలో ఆదివారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యుఈఈయు) ఆత్మకూరు డివిజన్ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా యుఈఈయు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండమూరి హజరత్తయ్య, డివిజన్ అధ్యక్షుడిగా సీహెచ్ ఓంకార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ విజయరామిరెడ్డి, కోశాధికారిగా షేక్ మస్తాన్, మహిళా కార్యదర్శిగా కె శాంతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ నరసింహారెడ్డి, ప్రచార కార్యదర్శిగా వై రమణారెడ్డి ఎన్నికయ్యారు. వీరితోపాటు సహాయ కార్యదర్శులు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, యుఈఈయు జిల్లా అధ్యక్షుడు వి సుధాకర్‌రావు, సీఐటీయు మండలాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, జిల్లా రైతు సంఘం నాయకులు జి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన యూఈఈయూ నేతలు

మహానాడును విజయవంతం చేయాలి

● దేవదాయ శాఖామంత్రి ఆనం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరులోని ఆనం క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ కీలక నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడుకు వచ్చే కార్యకర్తలకు అవసరమైన వసతి, ఆహారం, రవాణా తదితర అన్ని ఏర్పాట్లు ముందుగానే సమన్వయంతో చేసుకోవాలని నేతలకు సూచించారు. భారీ స్థాయిలో జరిగే మహానాడుకు ఆత్మకూరు నియోజ.కవర్గం నుంచి 10 వేల మందికి పైగా టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మహానాడు కార్యక్రమానికి ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అప్కాబ్ చైర్మన్ గుంజి వీరాంజనేయులు, పలువురు టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

నాగవరపమ్మకు పూజలు



నాగవరపమ్మకు పూజలు చేస్తున్న పూజారి

సంగం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగవరపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సహకారంతో ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సీతారామపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను శాలువా, మొమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు షఫీఅహ్మద్, శ్యాంబాబు, సుధాకర్, పీసీ అల్లూరిరాజు, జనార్దన్‌రాజు, వెంకటరెడ్డి, కృష్ణయ్య, మహబూబ్ మస్తాన్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో వీధులు జలమయం



అనంతసాగరంలో చిత్తడిగా మారిన రోడ్డు

ఉదయగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. వర్షంతో వీధులు జలమయం అయ్యాయి. మురుగు కాలువలు పొంగిపొర్లాయి. చెత్తాచెదారం రోడ్లపై చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో చెరువుల గుంతల్లోకి నీరు చేరింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు పొలాలను దుక్కులు దున్ని సేద్యానికి సిద్ధం చేస్తున్నారు.

● అనంతసాగరం : కొద్దిపాటి వర్షం కురిసినా స్థానిక కెనరా బ్యాంకు సమీపంలో బీసీ కాలనీకి వెళ్లే రోడ్డు చిత్తడిగా మారుతోంది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక రహదారిపై వర్షపు నీరు నిల్వఉండి దుర్గంధం వెదజల్లుతోందని పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ యువత రాణించాలి : సీఐ



చాంపియన్ షిప్ సాధించిన క్రీడాకారులతో సీఐ గంగాధర్, అధ్యాపకులు

ఆత్మకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆత్మకూరు సీఐ జి గంగాధర్ సూచించారు. స్థానిక ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాలలో ఆదివారం క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్‌జెడి క్రీడాకారులు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటి సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్ సాధించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు శ్రీనివాసులరెడ్డి, మధుసూదన్ రెడ్డి, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

అంకాలమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ

సీతారామపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని బెస్తకాలనీలో జరుగుతున్న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరిరోజు ఆదివారం అంకాలమ్మ ఆలయం వద్ద అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. గ్రామం నుంచి భక్తులు ఊరేగింపుగా పొంగళ్లు నెత్తిన పెట్టుకొని అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమశిలకు 30 పడకల ఆసుపత్రి మంజూరు

అనంతసాగరం మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిలకు 30 పడకల ఆసుపత్రి మంజూరైంది. ఈవిషయం ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. దీంతో పక్కాభవనం పూర్తి చేసే లోపు తాత్కాలిక భవనాల్లో వైద్యశాల ఏర్పాటుచేసి ప్రజలకు సేవలు అందించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల సోమశిలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం స్థానికులతో ముఖాముఖి ఏర్పాటుచేయగా ఆసుపత్రి లేక అవస్థలు పడుతున్నామని సీఎంకు విన్నవించారు. దీంతో ఆయన మంత్రి ఆనం ద్వారా పూర్తి సమాచారం తెలుసుకున్నారు. 30 పడకల ఆసుపత్రికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనేపథ్యంలో ఆసుపత్రి సేవలు త్వరలో అందుబాటులోకి వస్తున్న క్రమంలో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ శాంతికి కృషి చేయాలి

వింజమూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతికి అందరూ కృషి చేయాలని పాకాల సీనియర్ పిరమిడ్ మాస్టర్ గిరి సూచించారు. స్థానిక వేదవ్యాస విశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవిచంద్ర, చిన్న, సుబ్బారెడ్డి, జానకీ రామిరెడ్డి, నారాయణరెడ్డి, ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.